ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-11-2024 గురువారం సంపుటి: 30 సంచిక: 300 పేజీలు: 8+4 వెల: 6.50

ప్రధాని అభీష్టం మేరకు నడుచుకుంటా: షిండే

ఇజ్రాయెల్, హెజ్బొల్లా కాల్పుల విరమణకు మద్దతు

5

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లోనే..



### కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవు

రైతు భరోసా విధివిధానాలపై త్వరలోనే స్పష్టత


కలెక్టర్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్న కెటిఆర్

మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి చిట్‌చాట్

బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో డి. సిఎం భట్టి చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 27:** తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోని మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు లేవని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తమవి అన్ని ఉమ్మడి నిర్ణయాలేనని, కొత్త నేతలు వచ్చినప్పుడు కొన్ని రోజులు పాత,కొత్త సమస్యలు ఉంటాయని తెలిపారు. తమలో విభేదాలు అంటూ పసలేని విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాకుల్లా అరుస్తున్నారని విమర్శించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ పార్టీతో టచ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా, మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైడ్రా, మూసీ విషయంలో పూర్తిగా ఆలోచించాకే ముందుకు పోతున్నామన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాలు కాజేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు కాజేసిన భూముల వివరాలను బయటకు తీస్తామన్నారు. కెటిఆర్ భ్రమల్లో బతుకుతున్నారని ఆయన మండిపడ్డారు. కెటిఆర్ ఏం మాట్లాడుతున్నారో ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని పట్టుకొని కెటిఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులంతా తాము ఏది చెబితే అది వినాలని కేటీఆర్ భావిస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. అందుకే.. జిల్లా కలెక్టర్‌ని పట్టుకుని సన్నాసి అంటూ తిట్టారని, ఆయనకు మర్యాద తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు బీఆర్ఎస్ పార్టీ చెప్పినట్లు వినరని, వాళ్లు చట్టం, నిబంధనల ప్రకారం వెళతారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో నిర్బంధ ఆంక్షలు లేవని, తాము నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కెసిఆర్... అసెంబ్లీకి వచ్చి తన రోల్ ప్లే చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పెకలించడం ఎవరి తరమూ కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీల్లో ఒకటైన రైతు భరోసాపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘంతో కసరత్తు చేస్తుందని, రైతు భరోసా విధివిధానాలు ఏంటనేది త్వరలో క్లారిటీ ఇస్తామన్నారు. ఇటీవల జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమిని ముందుపెట్టి చూపిస్తున్నారని.. మరి జార్ఖండ్‌లో అద్భుత ఫలితాల్ని ఎందుకు చూడలేకపోతున్నారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ మంచి ఫలితాల్నే సాధిస్తుందని, కర్ణాటకలో, కేరళ లో గెలిచింది కాంగ్రెస్ పార్టీనే అంటూ గుర్తు చేశారు.ఒక్క మహారాష్ట్రను మాత్రమే పరిగణలోకి తీసుకోవడమేంటని, వెస్ట్ బెంగాల్‌లో, మధ్యప్రదేశ్‌లో గెలిచింది కాంగ్రెస్ కూటమి పార్టీలే అంటూ గుర్తు చేశారు. అన్ని చోట్ల ఒకేపార్టీ ఉండాలనే ఆలోచన ప్రజాస్వామ్యంలో >>2

## పిల్లలు చనిపోతేనే స్పందిస్తారా?



అధికారులు నిద్రపోతున్నారా?

మాగనూర్ ఫుడ్‌పాయిజన్ ఘటనపై హైకోర్టు సీరియస్

విచారణ సోమవారానికి వాయిదా

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** వారంలోపు వరుసగా మూడుసార్లు మధ్యాహ్న భోజనంలో ఫుడ్ పాయిజన్ అయిన మాగనూర్ పాఠశాల ఘటనపై హైకోర్టు సీరియస్ అయింది. వరుసగా ఫుడ్ పాయిజన్ అవుతుంటే అధికారులు నిద్రపోతున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్ రావులతో కూడిన ధర్మాసనం విచారణ నిర్వహించింది. పిటిషనర్ గురుతేజ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. మాగనూరు జడ్పీ పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు భోజనం వికటించి పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని కోర్టుకు తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించకపోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన వాదించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడంతో అస్వస్థతకు గురికావడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రి పాలవడమేమిటని.. ఇలా జరుగుతుంటే సంబంధిత అధికారులు నిద్రపోతున్నారా? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యాహ్నం భోజనం వికటించిన పాఠశాలలో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నివేదిక వచ్చాక అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టు తేలితే వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించిది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనడానికి ఇది నిదర్శనమని, ఈ విషయంలో ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. అధికారులకూ పిల్లలున్నారు కదా అని పేర్కొంటూ, మానవత్వంతో వ్యవహరించాలని సూచించింది. ఘటనపై వివరాలు సమర్పించడానికి వారం రోజుల సమయం కావాలని పీపీకోరడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నాన్ బెయిలబుల్ >>2



### జార్ఖండ్ సిఎంగా నేడు హేమంత్ ప్రమాణం

రానున్న రాహుల్, మమత, తేజస్వియాదవ్

**రాంచి,నవంబరు 27:** జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్‌సోరెన్ గురువారం ప్రమాణస్వీకారంచేయనున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వాన్ని రద్దుచేయడం, తానురాజీనామాచేసిన లేఖను గవర్నర్‌కు అందచేసిన సోరెన్ కేర్‌టేకర్‌సిఎంగా కొనసాగు తున్న సంగతి తెలిసిందే. తన ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా ప్రధానిమోడీని స్వయంగా కలిసి హేమంత్‌సోరెన్ ఆహ్వానం పలికారు. ఆయనతోపాటు ఆయన భార్య ఎమ్మెల్యేకల్పనాసోరెన్‌సైతం ప్రధానిని కలిసి ప్రమాణ స్వీకారానికి >>2



### బిజెపి నుంచే 'మహా' సిఎం

మళ్లీ ఇద్దరు డిప్యూటీలు

నేడు ఎన్డీయె కీలక భేటీ

**న్యూఢిల్లీ, నవంబరు 27:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఈసారి బారతీయ జనతాపార్టీ నాయకుడే అవుతారని తేలిపోయింది. అయితే గత ప్రభుత్వం తరహాలోనే ఇద్దరు డిప్యూటి సీఎంలు తప్పదని బిజెపినుంచే విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం ఎన్డీయే సమావేశం ఉన్నందున దేవేంద్ర ఫడ్నవిస్‌తోపాటు, అజిత్‌పవార్, ఏక్‌నాథ్‌షిండేలు పాల్గొంటారు. ఆసమావేశంలోనే అభ్యర్థిని నిర్ణయించి అదేరోజు ప్రకటించే అవకాశంఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ఎవరిని నియమించినా తాను ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని షిండే బిజెపి హైకమాండ్‌కు >>2



### గురుకుల విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి

**కొత్తకోట నవంబరు 27 ప్రభాతవార్త:** మదనాపురం పట్టణ కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనాపురంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం మదనాపురం మండలం కొన్నూర్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సత్యమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్ 7 వ తరగతి మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. తల్లితండ్రులు జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. ప్రవీణ్ కూడా ఇది వరకు హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న గురుకులలో చదివే వాడని తల్లితండ్రులు తిరిగి స్వగ్రామానికి వెళ్లే ఆలోచనలో తమ కుమారుడు ప్రవీణ్ కూడా మాకు అందుబాటులో ఉండేలా మదనాపురం గురుకులకు ఇటీవల ట్రాన్స్ఫర్ >>2

విమానాలకు 994 బూటకపు బెదిరింపు కాల్స్ 5

## నేటి నుంచి రైతు పండుగ

మూడు రోజులు విజయోత్సవాలు

రైతులకు అవగాహన పెంచే వేడుకలు

25 విభాగాల ఆధ్వర్యంలో 150 స్టాళ్ల ఏర్పాటు



అమిస్తాపూర్‌లో రైతు సదస్సు ఏర్పాట్లు దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు27: మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రంగా ప్రజాప్రభుత్వం గురువారం నుంచి మూడురోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తోంది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలన్నీ భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రైతు సదస్సులో భాగంగా 25 వివిధ విభాగాల అధ్వర్యంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు ఈ సదస్సులో పాలుపంచుకుంటారు. యూనివర్సిటీలతో పాటు వ్యవసాయ, అనుబంధ శాఖలన్నీ ఇందులో పాల్గొంటాయి. తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా ఉండేలా.. రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే భారీగా నిధులు ఖర్చు చేసింది. దాదాపు రూ.54,280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసింది. దేశంలోనే వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు ఒకేసారి రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసింది. కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఇటీవలే వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధికారం చేపట్టిన వెంటనే రైతులను బాగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమల్లోకి తెచ్చిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా ప్రజా ప్రభుత్వం కొనసాగించింది. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్తుకు ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తొలి మూడు నెలల్లోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులను పంపిణీ చేసింది. యాసంగి సాగుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను ఎకరానికి రూ. 5 వేల చొప్పున రైతులందరి ఖాతాలో జమ చేసింది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను >>2



## మొన్న వాంకిడి.. నిన్న మాగనూర్.. తర్వాత!

చిన్నారులను కాటేస్తున్న 'ఫుడ్ పాయిజన్'

21 రోజులు చికిత్స పొందుతూ మరణించిన శైలజ

నలుగురు విద్యార్థులు మృతి..

1000 మందికిపైగా ఆసుపత్రిపాలు

సస్పెన్షన్లు, బదలీలతో సరిపెడుతున్న సర్కార్

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్నం భోజనం మొదలుకొని.. సంక్షేమ హాస్టల్స్, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, యూనివర్సిటీ హాస్టల్స్ వరకు ఇలా అన్నింటిలోనూ ఫుడ్‌పాయిజన్ అవుతోంది. కొద్ది రోజులుగా ఇటువంటివి ప్రతి రోజూ రాష్ట్రంలోని ఏదో ఒక జిల్లాలో జరుగుతున్నట్టు వార్తలొస్తున్నాయి. అందుకు ఉదాహరణగా మంగళవారం మాగనూర్ హైస్కూల్‌లో జరిగిన ఘటన చెప్పుకోవచ్చు. నారాయణపేట్ జిల్లా మాగనూర్ ప్రభుత్వ పాఠశాలలో వారంలోపు మూడుసార్లు మధ్యాహ్న భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కుమురంభీం జిల్లా వాంకిడి ఆశ్రమపాఠశాలకి చెందిన విద్యార్థిని శైలజ కలుషితాహారం తిన్న తరువాత 21 రోజులపాటు హైదారబాద్‌లోని నిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత ఇప్పటి వరకు నలుగురు విద్యార్థులు కలుషితాహారంతో మృతి చెందారని.. 1000 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిపాలయ్యారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. వాస్తవంగా రాష్ట్రంలో జరుగుతున్న కలుషితాహార ఘటన వలన నలుగురు కంటే ఎక్కువ మంది విద్యార్థులే మరణించి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్నం భోజనం తరచుగా కలుషితం అవుతున్న ఘటనలు బయటికొస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం జేఎన్‌టీయూ హాస్టల్‌లో సైతం ఇటువంటి ఘటన వెలుగుచూసింది. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో అక్టోబర్ 30న ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలో 26వేలకి పైగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు,1024గురుకులాలు, 470 కేజీబీవీలు, 1000కిపైగా సంక్షేమ హాస్టల్స్, మరో16 వర్సిటీలు వాటికి అనుబంధంగా >>2

దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమలో

## పనులు నిలిపివేయండి

ఆదేశించిన సర్కార్.. ఆందోళన విరమించిన రైతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు27:** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇథనాల్ పరిశ్రమ అనుమతులు, షరతులు, స్థానికుల ఆందోళనపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు నివేదిక పంపించారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతులను పునః సమీక్షించాలని సర్కారు నిర్ణయించింది. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని >>7



### 30 నుంచి 7 వరకు బిఆర్ఎస్ గురుకుల బాట

ఫుడ్ పాయిజన్‌తో 11 నెలల్లో 48 మంది విద్యార్థులు మృతి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు27:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా కొనసాగుతున్న మరణాలు విషాద సంఘటనల నేపథ్యంలో, ఆయా విద్యాసంస్థల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు పార్టీ తరఫున గురుకుల బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఈనెల 30 తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న గురుకుల విద్యాసంస్థలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను కాలేజీలను పరిశీలిస్తారన్నారు.ఈ గురుకుల బాట కార్యక్రమానికి >>2

## మూసీపై ముందుకు..

ప్రక్షాళన కార్యాచరణపై ప్రభుత్వం కసరత్తు

హైకోర్టు తీర్పు నేపథ్యంలో జలవనరుల సంరక్షణకు చర్యలు

నిర్ణీత కాలంలో ఆక్రమణల తొలగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు27:** హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మూసీ పునరుజ్జీవంతో పాటు జల వనరుల సంరక్షణకు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు దీనిపై సమాలోచనలు జరిపారు. హైకోర్టు తీర్పు ఆధారంగా భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ రూపకల్పనపై చర్చించారు. మూసీ పునరుజ్జీవనం విషయంలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ చేపడుతున్న చర్యలకు సానుకూలంగా తీర్పును ఇచ్చిందని భావిస్తున్న ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోనుంది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో భాగంగా ఇళ్ల కూల్చివేత, ఆక్రమణల తొలగింపును సవాల్ చేస్తూ దాఖలైన 46 పిటిషన్లను విచారించి ఇచ్చిన తనతీర్పులో హైకోర్టు హైదరాబాద్ నగరచరిత్ర, మూసీ వరదలు.. నిజాంకాలం నాటిచట్టాలు.. తర్వాతకాలంలో చట్టాలను ఉదాహరించింది. హైకోర్టు తీర్పుప్రకారం... 1908లో మూసీ నది వరదలు హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తడంతో నాటి నైజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ భవిష్యత్‌లో మూసీ సమీపంలోని వారికి రక్షణ కల్పించేందుకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మాణాలు చేపట్టడంతో రక్షణ గోడలు కట్టించారు. మూసీ ఎగువ భాగంలోని వరదను అడ్డుకునేందుకు నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లు ఇప్పుడు నగరానికి మంచి నీటిని అందిస్తున్నాయి. అన్ని ప్రజా రహదారులు, వంతెనలు, మురుగునీటి కాలువలు, నదులు,, నీటి ప్రవాహ మార్గాలు, చెరువులు, కుంటలు, కాలువలు, అన్నిరకాల నీటి ప్రవాహాలు ప్రభుత్వానికి సంబంధించినవంటూ నైజాం ప్రభుత్వం (1317 ఫస్లి యాక్ట్ 8) చట్టం చేసింది. ఆ చట్టం >>2



### చెరువులపై మాదే పర్యవేక్షణ

స్పష్టం చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు27:** హైదరాబాద్ లోని అన్ని చెరువులకు సంబంధించి పూర్తి పర్యవేక్షణ తమదేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రామమ్మ చెరువు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని >>2

## సరోగసి కోసం నగరానికి వచ్చిన మహిళ

# ఇష్టం లేక పారిపోయే యత్నంలో 9వ అంతస్తు నుంచి కిందపడి మృతి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 27 ప్రభాతవార్త:** సరోగసి(అద్దెగర్భం) కోసం అగ్రిమెంటు చేసుకొని నగరానికి వచ్చిన ఓ మహిళ అనుకోని ప్రమాదంలో మృతిచెందింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రాజేశ్‌బాబు(55) తన భార్య, తల్లితో కలిసి రాయదుర్గంలోని మైహోం భుజా అపార్టుమెంటు 9వ ఫ్లోర్‌లోని ఈ-901 ఫ్లాట్ నెంబరులో నివాసం ఉంటున్నాడు. కాగా రాజేశ్‌బాబుకు పిల్లలు లేకపోవడంతో సరోగసి(అద్దెగర్భం) ద్వారా పిల్లలు కనాలని ఆలోచించాడు. ఈమేరకు ఒరిస్సాకు చెందిన మధ్యవర్తి సందీప్‌ను సంప్రదించగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అశ్వితాసింగ్(25)తో సరోగసి కోసం చర్చలు జరిపి, 10లక్షల రూపాయలు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అగ్రిమెంటు మేరకు అక్టోబరు 24వ తేదీన అశ్వితాసింగ్, తన భర్త సంజయ్‌సింగ్(26), నాలుగేళ్ల కుమారుడితో కలిసి నగరానికి వచ్చి రాజేశ్‌బాబు ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. అశ్వితాసింగ్ రాజేశ్‌బాబు ఇంట్లోనే ఓ గదిలో ఉంటుండగా, భర్త సంజయ్‌సింగ్, కుమారుడితో కలిసి అక్కడే ఉన్న సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటు న్నారు. అశ్వితాసింగ్‌తో అగ్రిమెంటు జరిగిన తరువాత రాజేశ్‌బాబు దంపతులు కోర్టును ఆశ్రయించి సరోగసి కోసం చట్టప్రకారం అనుమతి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం కోర్టు అనుమతి కోసం వేచి ఉండగా, అశ్విత సింగ్ వారి ఇంట్లోనే ఉంటుంది. కాగా అశ్వితాసింగ్ భర్తతో విడిగా ఉంటుండడం, రాజేశ్‌బాబు పలు రకాలుగా వేదింపులకు పాల్పడుతుండడంతో సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉన్న తన భర్తకు సోమవారం ఫోన్ చేసింది. తనకు ఇక్కడ ఉండాలని లేదని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోదామని కోరింది. భార్య అభ్యర్థనను తోసిపుచ్చిన సంజయ్‌సింగ్ తాము రాజేశ్‌బాబుతో అగ్రిమెంటు చేసుకున్నామని, కొద్దిగా ఓపిక పడితే 10 లక్షల రూపాయల డబ్బు వస్తుందంటూ ఒప్పించాడు. రాజేశ్‌బాబు ఇళ్లు మొత్తం సెంట్రల్ లాకింగ్ సిస్టం ఉండగా, తన భర్తతో నేరుగా కలిసి మాట్లాడే అవకాశం సైతం అశ్వితాసింగ్‌కు మనస్థాపానికి గురైంది. దీంతో కోపంతో తన గదిలోకి వెళ్లిపోయిన అశ్వితాసింగ్ మంగళవారం వేకువ జామున రెండు గంటల ప్రాంతంలో తన గది బయట ఉన్న బాల్కానీ నుంచి కిందకు దిగి సొంత గ్రామానికి వెళ్లిపోవాలని ప్రయత్నించింది. ఇందులో భాగంగా తన మూడు చీరలను ఒకదానికి ఒకటి కట్టి, దాని ద్వారా ఐదవ అంతస్థులో ఉన్న పోర్టికోకు వెళ్లి, అక్కడి నుంచి బయటపడాలని ప్రయత్నించింది.

ఈ క్రమంలో కిందకు దిగుతున్న సమయంలో పట్టుజారి ఒక్కసారిగా 9వ అంతస్థు నుంచి అపార్టుమెంటు కింద పడిపోయింది. తీవ్ర గాయాలైన అశ్వితా సింగ్ అక్కడికక్కడే మృతి చెందింది. వేకువ జామున 3 గంటల ప్రాంతంలో అపా ర్టుమెంటు సెక్యూ రిటీ గార్డులు అశ్వితాసింగ్ మృతదేహాన్ని గమనించి పోలీసులకు, రాజేశ్‌బాబుకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు అశ్వితా సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## దేశ వ్యాప్తంగా తొమ్మిది నెలల్లో 11,333 కోట్లను కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

### అగ్రభాగాన స్టాక్ ఎక్స్ఛేంజి నేరాలు, ద్వితీయ స్థానంలో పెట్టుబడుల స్కాం

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** భారత్‌లో సైబర్ నేరాలను నివారించేందుకు కేంద్రంతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాలు ఓవైపు గట్టిగానే కృషి చేస్తున్నా సైబర్ నేరగాళ్ల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. గడచిన తొమ్మిది నెలల వ్యవధిలో సైబర్ నేరగాళ్లు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో 11 వేల 333 కోట్ల రూ పాయలను కొల్లగొట్టారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4) డేటా ఈ విషయాలను వెల్లడించింది. ఈ ఏడాది జన వరి నుంచి సెప్టెంబర్ వరకు సైబర్ నేరగాళ్లు సాగించిన ఆరాచకాలపై ఐ4 విభాగం విశ్లేషించగా ఈ వివరాలు వెలుగు చూశాయి. సైబర్ నేరగాళ్ల నేరాలలో ఎక్కువగా స్టాక్ ఎక్స్ఛేంజిలోనే వున్నాయి. స్టాక్ ట్రేడింగ్ స్కాంల ద్వారా సైబర్ నేరగాళ్లు సునాయసనంగా డబ్బులను కాజేసినట్లు ఐ4 తేల్చింది. స్టాక్ ట్రేడింగ్ మోసాలకు సంబం ధించి రెండు లక్షల 28 వేల 94 ఫిర్యాదులు రాగా ఇందులో 4636 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీని తరువాత పెట్టుబడుల స్కాం రెండవదిగా నిలిచింది. ఈ స్కాంకు సంబంధించి లక్షా 360 ఫిర్యాదులు రాగా ఇందులో 3216 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. దీని తరువాత డిజిటల్ అరెస్టు స్కాం మూడవదిగా నిలిచింది. ఈ స్కాంలో 63, 841 ఫిర్యాదులు రాగా ఇందులో 1616 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఒక్క భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా సైబర్ నేరగాళ్ల హాల్‌చల్ కొనసాగాయని ఐ4 తేల్చింది. సిటిజన్ ఫైనాన్సియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం డేటాలో వు న్న వివరాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ప్రపంచ వ్యాప్తంగా 12 లక్షల సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా 45 శాతం నేరాలు ఆగ్నేయాసియా దేశాలైన మయన్మార్, కాండోడియా, లావోస్‌లో జరిగాయని తేలింది.

## వృద్ధ దంపతుల దారుణ హత్య

### అద్దె ఇంటి కోసం వచ్చి కిరాతకానికి పాల్పడిన గుర్తుతెలియని ఆగంతకులు

### ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు

**నేలకొండపల్లి, నవంబరు 27 ప్రభాతవార్త:** ఇల్లు అద్దె కోసం వచ్చి వృద్ధ దంపతులను అత్యంత దారుణంగా హత్యచేసిన ఘటన బుధవారం కొత్తకొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల యర్ర వెంకటరమణ (60), యర్ర



హత్యకు గురైన యర్ర వెంకటరమణ, కృష్ణకుమారి దంపతులు (ఫైల్)

కృష్ణకుమారి (58) అనే దంపతులు గత కొన్నేళ్ళుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్ లోను, కుమార్తె ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోని ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా లోగల జగ్గయ్యపేటలో నివసిస్తున్నారు. కాగా, గత పదిహేను రోజుల క్రితం ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఇల్లు అద్దెకు కావాలని కొత్తకొత్తూరు గ్రామంలోని యర్ర వెంకటరమణ నివాసంకు వచ్చి మాట్లాడి వెళ్ళారు. ఆతర్వాత గత మూడు రోజుల క్రితం సదరు ఇరువురు మహిళలు యర్ర వెంకటరమణ వద్దకు వచ్చి మేము సామానులు తెచ్చుకోలేదు, ఈరోజు ఇక్కడే ఉండి తెల్లా ్లరి వెళ్ళి పోయి సామానులు తెచ్చుకుంటామని అర్ధరాత్రి ఆ ఇంట్లోనే గడిపారని తెలిసింది. కాగా, బుధవారం ఉదయం అదే ఇంటిలోని మరొక పోర్షన్‌లో అద్దెకుంటున్న వారు ఇంటి యజమాని యర్ర వెంకటరమణ ఎంతకి బయటకు రాకపోవడంతో వెళ్ళి చూడగా ఇంటికి తాళ్ళం వేసి ఉండటమే కాక ఇంటి చుట్టూ ఘాటైన ఎండుకారం చల్లి ఉండటంతో ఆందోళన చెందిన వారు భయంతో ఇంటి యజమాని పిల్లలకు సమాచారం ఇచ్చారు. దీంతో కొంత సేపటికి ఈ సమాచారం తెలుసుకున్న ఇంటి యజమాని యర్ర వెంకటరమణ తమ్ముడు రమేష్ వచ్చి పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీ ంతో నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్ తన పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలంకు వచ్చి పరిశీలించి చూశారు. ఇంటి యజమాని యర్ర వెంకటరమణ, భార్య కృష్ణకుమారి దంపతులు ఇరువురు అనుమానాస్పద స్థితిలో హత్యగావించి ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం తెలిపారు. దీంతో ఖమ్మం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్ బృందాలు సంఘటనా స్థలంకు చేరుకుని విచారణ ప్రారంభించాయి. ఇంటి యజమాని యర్ర వెంకటరమణ తన గదిలోని బెడ్‌కు బీరువాకు మధ్యలో నోటి నుంచి రక్తం కారి విగత జీవుడై మృతిచెంది ఉన్నాడు. భార్య కృష్ణకుమారి నడి ఇంట్లో శవమై కన్పించింది. ఇల్లు అద్దెకు కోసం వచ్చిన సదరు ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఈ ధారుణానికి పాల్పడి ఉంటారని సంఘటనా స్థలంను సందర్శించిన ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి స్థానిక విలేకరులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సిఐ టి.సంజీవ, నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వరి దిగుబడిలో తెలంగాణ రికార్డు

### 1.50 కోట్ల టన్నుల ఉత్పత్తి అంచనా

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** వరి దిగుబడిలో తెలంగాణ రికార్డు సృష్టించబోతోంది. వానాకాలం సీజనుకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా 60.80 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. తద్వారా 1.50 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ దిగుబడిలో 91 లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 47 లక్షల టన్నులు సన్న రకాలుకు చెందని ధాన్యం కాగా, 44లక్షల టన్నుల ఎకరాలు దొడ్డు రకం ధాన్యంగా లెక్కలు వేసింది. ఇదే సమయంలో ఈ వానకాలం మార్కెటింగ్ సీజను నుండే సన్న రకం ధాన్యానికి రైతులకు ప్రోత్సాహకంగా ఉండేందుకు గాను క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ ఇస్తోంది. ఈ మొత్తం ధాన్యం కొనుగోలు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు 30 వేల కోట్ల రూపాయల మేర నిధులు అవసరం అవుతాయని లెక్కకట్టింది. ప్రభుత్వ సెక్యూరిటీతో ఈ మొత్తాన్ని బ్యాంకులో రుణంగా తీసుకుంటోంది. ఇక ధాన్యం కొనుగోలు నిమిత్తం ఇప్పటికే ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలకు పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చిందని వ్యావసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా ధాన్యం కొనుగోలు నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 7,572 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల స్పీడందుకున్నట్లు అధికారులు తెలిపారు.

## పార్లమెంట్‌లో తొలిసారి మూసీ రివర్‌ఫ్రంట్ ప్రస్తావన

### మూసీ ప్రక్షాళనపై కేంద్రానికి క్లారిటీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు27:** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న మూసీ నదీ ప్రక్షాళనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. దేశ పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తెలిపింది. రాజ్యసభలో చర్య సందర్భంగా బుధవారం మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు గురించి ప్రస్తావన రాగా ఆయా విషయాలపై రాష్ట్ర ప్రభుత్వ సమాచారాన్ని కేంద్ర మంత్రి టోకెన్ సాహు సభలో వెల్లడించారు. పార్లమెంట్ లో తొలిసారి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు గురించి ప్రస్తావన రాగా.. రాష్ట్రానికి ఎంతో కీలకమైన ఈ నదిని కాపాడేందుకే ఈ ప్రాజెక్టు చేపట్టినట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ నిర్మాణం, ప్రభుత్వ చర్యలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారంటూ బీఆర్ఎస్ ఎంపీ సురేష్ రెడ్డి రాజ్యసభలో ప్రస్తావించారు. బీఆర్ఎస్ ఎంపీ అడిగిన ప్రశ్నకు రాతపూర్వ సమాధాన ఇచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖసహాయ మంత్రి టోకెన్ సాహు మూసీ నదిని తిరిగి జీవనదిగా, స్వచ్ఛమైన నదిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున కూల్చివేతలు ఉండవని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపిందన్నారు. ఈప్రాజెక్టు కోసం చేపట్టిన నిర్మాణాల కూల్చివేతలు అవసరమైన మేరకే ఉంటాయని స్పష్టం చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాల దృష్ట్యా నదీ పరిహార ప్రాంతాల్లోని నిర్మాణాల్లో ఉండే ప్రజలకు అక్కడి నుంచి తరలిస్తామని,.వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహాయ పునరావాస చర్యలు చేపట్టినట్లు వెల్లడించిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పునర్నిర్మాణంలో భూములు కోల్పోయే బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల మేరకే భూసేకరణ చేపడతామని కేంద్రానికి తెలిపినట్లు.. కేంద్ర మంత్రి రాజ్యసభలో వెల్లడించారు. వాస్తవానికి నదీ గర్భంలో ఉండేందుకు ఎలాంటి అనుమతులు ఉండవని, అయినా.. రాష్ట్ర ప్రభుత్వం ఆయా నివాసితల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందని తెలిపింది. అందుకే మూసీ నదీ గర్భం, బఫర్ జోన్ల నుంచి తరలించే వారి కోసం.. సమీప ప్రాంతాల్లోనే 15 వేలకు పైగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సిద్ధం చేసినట్లు వెల్లడించింది. వాళ్లందరికీ ఇళ్ల కేటాయింపులు చేపడతామని, ఎవరికీ ఆపద రాకుండా చూసుకుంటామని తెలిపింది. బాధిత కుటుంబాల కోసం, వారి జీవన ప్రమాణాలకు మద్దతుగా నిలిచేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం.. ప్రత్యేకంగా ఒక కమిటీని సైతం నియమించినట్లు పార్లమెంట్‌కు తెలిపింది. హైదరాబాద్ నగరం నుంచి ప్రవహిస్తున్న మూసీ నదిని తిరిగి జీవనదిగా, స్వచ్ఛమైనదిగా మార్చడంతో పాటు కాలుష్య నివారణ, వరదల బారి నుంచి కాపాడేందుకు ఈ ప్రాజెక్టు సహాయ పడుతుందని వెల్లడించింది. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అనేక విషయాలపై చర్చలు జరుగుతున్నాయన్న రాష్ట్ర ప్రభుత్వం.. త్వరలోనే వాటి గురించిన వివరాల్ని అందరికీ తెలుపుతామని ప్రకటించింది.

## టి.నాబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, అవగాహన, పునరావాసంపై సదస్సు

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో విద్యా సంస్థలు, ఐటి కంపెనీల్లో మాదకద్రవ్యాల నిర్మూలన, అవగాహ న, పునరావాసంపై సదస్సు బుధవారం ప్రారంభమయ్యింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో మొదలైన ఈ సదస్సుకు టి.నాబ్ డైరక్టర్ సం దీప్ శాండిల్యా అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఐటి కంపెనీల నిర్వాహకులతో పాటు విద్యా సంస్థల యాజమాన్యాలు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మాట్లాడుతూ తెలంగాణలో డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలన్న సర్కారు సంకల్పంలో భాగంగా టి.నాబ్ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు, అబ్కారీ విభాగాలతో కలిసి దాడులు చేబడుతూ పెద్ద సంఖ్యలో డ్రగ్స్ స్మగ్లర్లతో పాటు వినియోగదారులను అరెస్టు చేస్తోందని తెలిపారు. దీంతో పా టు కల్తీ కల్లు తయారీకి వాడే అల్ప్రాజోలంను తయారు చేసే యూనిట్లను కూడా జప్తు చేసిందని, ఇక్కడ పనిచేసే కెమిస్ట్‌లను, నిర్వాహకులను అరెస్టు చేయడం జరిగిం దని ఆయన తెలిపారు. విద్యా సంస్థలు, ఐటి సంస్థల వరకు వస్తే ఇటీవల పలుచోట్ల పోలీసులతో పాటు అబ్కారీ, టి.నాబ్ దాడుల్లో పలువురు విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డ్రగ్స్ తీసుకుని దొరికిపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆయన అన్నారు. సమాజంలో ఉన్నతంగా ఎదగాల్సిన విద్యార్థులు, ఉన్నత ఉద్యోగాల్లో వుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఇలా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడం సరైంది కాదని ఆయన అన్నారు. ఈ విషయంలో మొదటగా యువతను మాదకద్రవ్యాలకు దూరం చేయాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. పాఠశాలలు, కాలేజీల వద్ద డ్రగ్స్ విక్రయించే స్మగ్లర్ల భరతం పట్టాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. ఇదే స మయంలో కాలేజీలు, పాఠశాలలో యాంటి డ్రగ్స్ కమిటీలు సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 20,989 పాఠశాల ల్లో వంద శాతం యాంటి డ్రగ్స్ కమిటీలు వుండగా 4729 కాలేజీలు, 6249 విశ్వవిద్యాలయాలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుతున్నాయ ని, ఇందులో చాలావరకు ఇప్పటికే వున్నాయని సందీప్ శాండిల్యా తెలిపారు. అయితే పాఠశాలలు, కాలేజీల్లో యాంటి డ్రగ్స్ కమిటీల పనితీరును అక్కడి యాజమానా ్యలతో పాటు విద్యాశాఖలోని విభాగాలు బాధ్యతగా తీసుకుని అవి పని చేసేలా చూడాలని ఆయన అన్నారు. ఇదే సమయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న నేరగాళ్లకు శిక్షలు పడేలా చేస్తున్నామని, గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇది పెరిగిందని ఆ యన వెల్లడించారు. డ్రగ్స్ కేసుల్లో నేరగాళ్లకు శిక్షలు పడడం అబ్కారీ శాఖ నాలుగు శాతం వుండగా పోలీసు శాఖలో 11 శాతం వుందని దీనిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై టి.నాబ్ ఇప్పటి వరకు నాలుగు విడతలుగా విద్య, వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, ఎన్‌సిసి, ఎ న్ఎస్ఎస్ విభాగాలకు చెందిన 940 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చిందని ఆయన తెలిపారు. తాజా సదస్సులో మరో వెయ్యి మందికి శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షా 30 వేల మంది ఎన్ఎస్ఎస్, 70 వేల మంది ఎన్‌సిసి సభ్యులకు టి.నాబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. తెలంగాణను డ్రగ్స్ రహిత సమాజంగా మార్చేందుకు అందరు చేయూతనందించాలని ఆయన కోరారు. ఈ సదస్సులో విద్యా, వైద్య శాఖతో పాటు ఐటి క ంపెనీల అధికారులు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వివరాలు అందించకపోవడం వల్లే ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆలస్యం

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు27:** రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన వివరాలు అందించకపోవడం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆలస్యం అవుతోందని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరైన ఆయన కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ సమర్పించారు. గతంలో విచారణ కమిషన్‌కు చెప్పిన అంశాలను బుధవారం అఫిడవిట్ రూపంలో అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక మొదలు మేడిగడ్డ ఆనకట్ట పియర్స్ కుంగిన వరకు అన్ని అంశాలను అఫిడవిట్ లో పొందుపరిచినట్లు తెలిపిన ఆయన, ఇటీవలి పరిణామాలను కూడా పేర్కొన్నట్లు చెప్పారు. ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక అంశం కూడా ప్రస్తావనకు వచ్చిందన్న శ్రీరాం, నివేదిక ఆలస్యానికి గల కారణాలను కమిషన్ కు వివరించినట్లు తెలిపారు. ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పూర్తి చేయలేదని అన్నారు. ఎన్డీఎస్ఏ సిఫారసు చేయనప్పటికీ రాష్ట్ర ఇంజినీర్లు బ్యారేజీ కింద ఉన్న గుంతల్ని పూడ్చివేశారని, దీంతో బ్యారేజీల కింద జియో టెక్నికల్ డేటాను కోల్పోయినట్లు వివరించారు. ఇదే విషయాన్ని ఎన్డీఎస్ఏ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసిందని తెలిపారు. జియో టెక్నికల్ పరీక్షలు ఇక సాధ్యం కాదని, కొన్ని చోట్ల జియో ఫిజికల్ పరీక్షలు చేసి, వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు వివరించారు. ఎన్డీఎస్ఏకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా డేటా అందలేదని, డేటా అందిన తర్వాత రెండు నెలలకు నివేదిక ఇస్తామని ఎన్డీఎస్ఏ తెలిపిందని వెదిరె శ్రీరాం పేర్కొన్నారు. మరోవైపు ఇవాళ కాళేశ్వరం కమిషన్ 15 మంది ఇంజినీర్లు హాజరయ్యారు. నీటిలభ్యత పరీక్షల నివేదికలు పూర్తికాకముందే బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టినట్లు కమిషన్ ముందు వెల్లడించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాలు కూడా మారినట్లు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్, వాస్తవాలు దాచిపెట్టి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని ఇంజినీర్లకు సూచించారు. తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జరిగిన, చూసిన, చేసిన పని గురించి వాస్తవాలు చెప్పడానికి ఎందుకంత ఇబ్బందని వ్యాఖ్యానించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన విషయాలను కేంద్రానికి ఆపాదించే ప్రయత్నం చేయవద్దన్న ఆయన, అఫిడవిట్‌లో ఉన్న అంశాలు క్షేత్రస్థాయిలో లేవని ఇంజినీర్లను ప్రశ్నించారు. ఇప్పటి వరకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సుమారు 90 మంది ఇంజినీర్లను విచారించింది.

## రాష్ట్ర వ్యాప్తంగా 95శాతం సర్వే పూర్తి

### వేగంగా కొనసాగుతున్న డాటా కంప్యూటరీకరణ

### 29,82,034 నివాసాల సమాచారం కంప్యూటరీకరణ పూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు27** సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే బుదవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 95 శాతం పూర్తయింది. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1,18,02,726 నివాసాలు గుర్తించారు. బుధవారం నాటికి 1,10,98,360 నివాసాలలో సమాచార సేకరణ పూర్తవగా కేవలం 7,04,366 నివాసాల సర్వే సమాచారాన్ని మాత్రమే సేకరించాల్సి ఉంది. సేకరించిన వివరాలను అధికారులు కంప్యూటరీకరించడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకొంటూ వేగవంతంగా సామాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నారు. ఈ ప్రక్రియనంతా సంబందిత ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షిస్తున్నారు. అత్యధికంగా 70.3 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి మూలుగు జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 59.8 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు సేకరించిన సమాచారంలో 29,82,034 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. జిహెచ్ఎంసీ పరిధి లో కూడా సర్వే ప్రక్రియ ఉపందుకుంది. 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా నేటి వరకు 20,15,965 నివాసాలలో సర్వే పూర్తి చేసి 80.5 శాతానికి చేరుకుంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లో కంప్యూటరీకరణ ప్రక్రియ కొనసాగుతోంది సర్వే పత్రాలను సమగ్రంగా భద్ర పరచడమే కాకుండా తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదుకు చేసేందుకు పకడ్బంది చర్యలు చేపడుతున్నారు.



న్యూఢిల్లీలో అవార్డులను అందచేస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

## సహకార సంస్థలకు నాఫ్స్కాబ్ అవార్డులు

### కరీంనగర్ సహకార బ్యాంక్‌కు మొదటి బహుమతి

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాత వార్త :** తెలంగాణ, అంధ్రప్రదేశ్‌ల్లోని పలు సహకార సంస్థలకు ప్రతిస్టాత్మక నాఫ్స్కాబ్ అవార్డులు దక్కాయి. వీటిలో తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) ఉంది. నేషనల్ ఫెడరేషన్ అఫ్ స్టేట్ కోపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్స్కాబ్) 60 ఏళ్ల ఉత్సవ వేడుకలు ఢిల్లీలోని భారత్ మండపం సమావేశహాల్లో ఘనంగా ప్రారంభమైయ్యాయి. తెలంగాణ, అంధ్రప్రదేశ్‌కు చెందిన సహకార వేత్తలు కొండూరు రవీంద్రరావు, భీమా సుబ్రమ్మాణ్యం నేతృత్వం వహిస్తున్న ఈ జాతీయ సహకార సంస్త వేడుకలను కేంద్రహోమ్, సహకారశాఖల మంత్రి అమిత్ షా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలకు గాను నాఫ్స్కాబ్ ప్రతిఏటా ఇచ్చే అవార్డులను సంబంధిత సహకార సంస్థల ప్రతినిధులకు కేంద్ర మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా పంపిణీ చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో తెలంగాణలోని కరీంనగర్‌జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు మొదటి బహుమతిలభించింది. కరీంనగర్ డిసిసిబి అధ్యక్షుడు రవీందర్‌రావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి సత్యనారయణరావులు ఈ అవార్డును అందుకున్నారు. అలాగే అంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్ (అప్కాబ్)కు మూడో బహుమతికి ఎంపికైయింది. ఈ అవార్డును అప్కాబ్ ఎండి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తీసుకున్నారు. ఇక కెడిసిసి బ్యాంక్ బహుమతిని అ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అఫీసర్ శ్యామ్ మనోహర్‌లు స్వీకరించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..సుప్రీం కోర్టులో తిరుపతన్న బెయిల్ పిటిషన్ వాయిదా

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న సిఎస్‌డబ్ల్యు మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్న సుప్రీం కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. గత మార్చి నెల నుంచి తిరుపతన్న జైల్లో వుండగా ఆయన బెయిల్ పిటిషన్లను హైకోర్టు పలుమార్లు డిస్మిస్ చేయడం తెలిసిందే. దీంతో ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరగా కొంత సమయం కావాలని ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాదితెలిపారు. ఇందుకు రెండువారాల గడువు ఇచ్చిన సుప్రీం కోర్టు దీనిపై తదుపరి విచారణను డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది.

## ద్వైపాక్షిక సంబంధాలకు బల్గేరియా ఆసక్తి

### మంత్రి శ్రీధర్ బాబుతో రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ భేటి

**హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త:** తెలంగాణాతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉందని భారత్‌లోని రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ వెల్లడించారు. బుధవారం సచివాలయంలో ఐటి,పరిశ్రమలమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. కాన్సులేట్, సుచిర్ ఇండియా ఇన్ ఫ్రా సిఇఓ డా. కిరణ్ కుమార్ సైతం ఆయనతో ఉన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు శ్రీధర్ బాబు అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్‌బాబు ఆయనకు వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపాలని శ్రీధర్ బాబు చేసిన ప్రతిపాదనకు డా.నికోలాయ్ యాంకోవ్ సంసిద్ధత వ్యక్తం చేసారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు చింతకుంట వెంకటరమణా రావు, మందుల సామేల్, పరిశ్రమల శాఖ కమిషనర్ డా. మల్సూర్, టిజిఐఐసి సిఇఓ వి. మధుసూధన్‌లు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
C.No.E1/17/2024-25 తేది: 26.11.2024
దిగువ సంతకందారునిచే, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్‌లో మునిసిపల్ సాధారణ నిధుల క్రింద 'ఇ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా అభివృద్ధి పనికి నమోదిత కాంట్రాక్టరుల నుండి టెండర్‌లు కోరబడుతున్నవి. పనుల సంఖ్య : 03, పని యొక్క ధర: రూ.25.00 లక్షలు. 1. బిడ్ దాఖలు ప్రారంభ తేది: 27.11.2024 ఉ.11.00గం. 2. బిడ్ దాఖలు ముగింపు తేది: 29.11.2024 మ.3.00గం. 27.11.2024 నుండి వెబ్‌సైట్, అందుబాటులో ఉంటుంది. పని వివరాలు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. తదుపరి వివరాలు మరియు స్పష్టతలను అన్ని పనిరోజులలో కార్యాలయ వేళలలో బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపల్ ఇంజనీర్ వారి నుండి పొందవచ్చును. AEE. 9121106496
సం/-. కమిషనర్, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్.
DIPR.NO. 7134-PP/CL/ADVT/1/2024-25 తేది: 27.11.2024



తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి ఫోన్ : 08455-270180
1. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం.24/2024-25, తేది: 27-11-2024, చిన్న నీటిపారుదల-సంగారెడ్డి జిల్లా, ఫుల్కల్(మం), మిన్‌పూర్(గ్రా) లోని తూమ్ చెరువు యొక్క పునరుద్ధరీకరణ పని గురించి తేది: 29-11-2024 నుండి తేది: 13-12-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.33.24 లక్షలు. 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం.25/2024-25, తేది: 27-11-2024, చిన్న నీటిపారుదల-సంగారెడ్డి జిల్లా, ఫుల్కల్(మం), సింగూర్(గ్రా) లోని కొత్త చెరువు యొక్క పునరుద్ధరీకరణ పని గురించి తేది: 29-11-2024 నుండి తేది: 13-12-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.16.17 లక్షలు. 3. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం.26/2024-25, తేది: 27-11-2024, చిన్న నీటిపారుదల-సంగారెడ్డి జిల్లా, ఫుల్కల్(మం), [illegible](గ్రా) లోని కొత్త చెరువు యొక్క పునరుద్ధరీకరణ పని గురించి తేది: 29-11-2024 నుండి తేది: 13-12-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.10.13 లక్షలు. 4. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం.27/2024-25, తేది: 27-11-2024, చిన్న నీటిపారుదల-సంగారెడ్డి జిల్లా, ఫుల్కల్(మం), ముద్దాయిపేట(గ్రా) లోని కామిల్ల చెరువు యొక్క పునరుద్ధరీకరణ పని గురించి తేది: 29-11-2024 నుండి తేది: 13-12-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.11.98 లక్షలు. 5. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం.28/2024-25, తేది: 27-11-2024, చిన్న నీటిపారుదల-సంగారెడ్డి జిల్లా, ఫుల్కల్(మం), మందిమానిక్యం(గ్రా) లోని దుర్గి చెరువు యొక్క పునరుద్ధరీకరణ పని గురించి తేది: 29-11-2024 నుండి తేది: 13-12-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.10.78 లక్షలు. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫామ్ www.tender.telangana.gov.in వెబ్ సైట్ నందు తేది: 29-11-2024 నుండి చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, నీటి పారుదల సర్కిల్, సంగారెడ్డి
DIPR.No.7119-PP/CL/Advt/1/2024-25, తేది: 27.11.2024



తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయం, డివిజన్ నెం.1, సంగారెడ్డి ఫోన్: 9440816444
1. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. 40/EE/ID-1/SRD/2024-25 తేది: 26.11.2024: సాగునీటి పారుదల శాఖ- సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్ మండలం, [illegible] గ్రామం, [illegible] అభివృద్ధి పనుల కొరకు తేది: 29.11.2024 నుండి 13.12.2024 వరకు బిడ్లను ఆహ్వానిస్తున్నాము. పని అంచనా విలువ రూ.9.87 లక్షలు. 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. 41/EE/ID-1/SRD/2024-25 తేది: 26.11.2024: సాగునీటి పారుదల శాఖ- సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్ మండలం, [illegible] గ్రామం, [illegible] చెరువు అభివృద్ధి పనుల కొరకు తేది: 29.11.2024 నుండి 13.12.2024 వరకు బిడ్లను ఆహ్వానిస్తున్నాము. పని అంచనా విలువ రూ.9.1 లక్షలు. 3. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. 42/EE/ID-1/SRD/2024-25 తేది: 26.11.2024: సాగునీటి పారుదల శాఖ- సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్ మండలం, సదాశివపేట్ గ్రామం, [illegible] కుంట అభివృద్ధి పనుల కొరకు తేది: 29.11.2024 నుండి 13.12.2024 వరకు బిడ్లను ఆహ్వానిస్తున్నాము. పని అంచనా విలువ రూ.8.79 లక్షలు. 4. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. 43/EE/ID-1/SRD/2024-25 తేది: 26.11.2024: సాగునీటి పారుదల శాఖ- సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్ మండలం, [illegible] గ్రామం, [illegible] కుంట అభివృద్ధి పనుల కొరకు తేది: 29.11.2024 నుండి 13.12.2024 వరకు బిడ్లను ఆహ్వానిస్తున్నాము. పని అంచనా విలువ రూ.9.2 లక్షలు. 5. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. 44/EE/ID-1/SRD/2024-25 తేది: 26.11.2024: సాగునీటి పారుదల శాఖ- సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్ మండలం, సదాశివపేట్ గ్రామం, [illegible] కుంట అభివృద్ధి పనుల కొరకు తేది: 29.11.2024 నుండి 13.12.2024 వరకు బిడ్లను ఆహ్వానిస్తున్నాము. పని అంచనా విలువ రూ.7.56 లక్షలు. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫామ్ www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు తేది: 29.11.2024 నుండి చూడగలరు.
సం/-, కార్యనిర్వాహక ఇంజనీరు, నీటిపారుదల డివిజన్ నెం.1, సంగారెడ్డి.
DIPR.NO. 7171-PP/CL/ADVT/1/2024-25 తేది: 27.11.2024



SAI
రిక్రూట్‌మెంట్ సెల్
హెడ్ ఆఫీస్, గేట్-10
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్
లోధీ రోడ్, న్యూ ఢిల్లీ-110003
ఫైల్ నం.: 01-04001(02)/5/2023-HO-పర్సనల్ డివిజన్, తేది: 18.11.2024
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కాంట్రాక్ట్ ప్రాతిపదికన చెఫ్ ఉద్యోగం నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఒక స్వయంప్రతిపత్తి గల సంస్థ, గరిష్ట కాలం 4 సంవత్సరాలకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన చెఫ్ యొక్క ఒక ఉద్యోగానికి నియామకం కోసం అర్హులైన, అర్హత కలిగిన మరియు ప్రేరణ కలిగిన భారతీయ పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఉద్యోగ వివరాలు మరియు ఇతర వివరాలు SAI వెబ్‌సైట్ అంటే http://sportsauthorityofindia.nic.inలో అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు పెట్టుకోవటానికి సంబంధించిన షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:-
(i) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించు తేదీ: 20.11.2024 (ఉ.10:00 గం.)
(ii) ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు కొరకు చివరి తేదీ: 05.12.2024 (సా.05:00 గం.)
డిప్యూటీ డైరెక్టర్
రిక్రూట్‌మెంట్ సెల్
SAI హెడ్ ఆఫీస్
CBC 47103/12/0014/2425

వార్త

ధనం లేకపోయినప్పటికీ ఏవో కోర్కెలు కలవాడు, సమర్థతలేనప్పటికీ కోపించేవాడు వీరిరువురూ తమను తామే నాశనం చేసుకుంటారు.

-జి. ఇలియట్

# పంచాయితీలను పాడుపెట్టొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని ఏనాటి నుంచో పాలకపెద్దలు పదేపదే చెబుతున్నా ఆచరణకు వచ్చేసరికి అవి మాటలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా గ్రామీణ వ్యవస్థ నేటికీ అస్తవ్యస్తంగానే ఉంది. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గూర్చి దశాబ్దాల తరబడి ఇవే మాటలు చెబుతూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవంగా చూస్తే సర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూవచ్చారు. అందుకే గతంలో ఉన్న గౌరవమర్యాదలు, అధికారాలు ప్రస్తుతం సర్పంచులకు లేవనే చెప్పొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే అధికారాలు లేని ఉత్సవ విగ్రహాలు మార్చారు. చివరకు స్వతంత్రంగా చీపురుకట్ట కొనలేని దురదృష్టపు పరిస్థితి తెచ్చిపెట్టారు. ఇందుకు కారణం వారూవీరు అనే దాని కంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేశారనే చెప్పొచ్చు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలు పెట్టి సర్పంచులను పక్కన పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితి తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే గత ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత లేకుండా పోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదో చేయాలనే నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు ఎన్నికల్లో పోటీచేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. గ్రామాభివృద్ధికి తాముచేసిన వాగ్దానాలను తీర్చేందుకు నడుంకట్టారు. ఈ చట్టాల వలలో తాము చేయలేమనే విషయంలో అర్థంకావడానికి చాలాకాలం పట్టింది. అయితే తమ గ్రామప్రజలకు తాము చేసిన వాగ్దానాలను పూర్తి చేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసికొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం ఆఫీసులచుట్టూ తిరిగి తిరిగి ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి మరొకపక్క గ్రామ ప్రజల ముందు తలవంచుకోలేక డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలోనే సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరెందరో సర్పంచులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఈపరిస్థితుల్లో ఈ యేడాది జనవరి చివరి నాటికి వారి పదవీకాలం పూర్తయిపోయింది. వారు మాజీలుగా అయి దాదాపు పదినెలలు దాటిపోయింది. కుంటిసాకులతో ఎన్నికలను వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక అధికారులతో గ్రామ రాజ్యాన్ని నడుపుతున్నారు. ఇక మాజీ సర్పంచుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. బిల్లులువస్తాయో, రావో తెలియదు. ఎప్పుడు వస్తాయో చెప్పేవారు లేరు. రోడ్లెక్కుతున్నారు. ధర్నాలు చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ మొన్న సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులు ఆందోళనకు దిగారు. వారేమి అదనంగా నిధులు ఇవ్వమని అడగడం లేదు. తాము ప్రజాహిత కార్యక్రమాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు వెచ్చించిన డబ్బులు చెల్లించమని ప్రాధేయపడుతున్నారు. దాదాపు నలభైమంది మాజీ సర్పంచులను పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకొని సాయంత్రం ఐదుగంటలకు వదిలిపెట్టారు. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఒకనాడు పంచాయితీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవమర్యాదలు ఉండేవి. భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందు నుంచే గ్రామాలు, గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఆనాడు కూడా గ్రామ సభలుండేవి. గ్రామ సభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలను ఆనాటి రాజరిక వ్యవస్థ ఎంతోప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీనకాలం నుండి గ్రామవ్యవస్థ ఏదో రూపంలో మనదేశంలో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానికసంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలోస్థానిక సంస్థలకు పటిష్టత అనేది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు, నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952నుంచి ఎన్నోకమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు పంచాయితీ రాజ్ వ్యవస్థలో చోటుచేసుకున్నాయి. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలక పెద్దలకు మనసు ఒప్పడంలేదు. రానురాను పంచాయితీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యపద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచులను సస్పెండ్‌చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. పంచాయితీరాజ్ వ్యవస్థలో ఎన్నోమార్పులు చేర్పులు చోటుచేసుకున్నా ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎందరు నేతలు మారినా అధికారపు వికేంద్రీకరణలో మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్నపెద్దలు జాగ్రత్తపడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయితీరాజ్ వ్యవస్థ పునాది రాయివంటిది. అందులో సర్పంచులు చాలాకీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం మాత్రం దురదృష్టకరం.

ఒక సమాజం దాని నైతిక విలువలను కోల్పోతే అది సర్వస్వం కోల్పోయినట్టే.



డ్రాయిడెన్

తనపై తనకు నమ్మకం ఉన్నవాడే ఇతరులకు నమ్మకస్తుడుగా ఉంటాడు.



బైరన్

# స.హ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు!

**ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కేటాయిస్తున్న వందల, వేలకోట్ల రూపాయల నిధుల పంపిణీలో వివిధ దశల్లో జరుగుతున్న అవినీతి మూలంగానే మధ్యదళారులు దోపిడీ చేయగలుగుతున్నారనేది రుజువైన సత్యమే. ఈ వాస్తవాన్ని గమనించిన ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపులు, వాస్తవిక ఖర్చుల వివరాలను పారదర్శకంగా ప్రజల ముందుంచడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చనే పాలనా నిపుణులు, బుద్ధిజీవుల డిమాండ్ మేరకు సుదీర్ఘ చర్చోపచర్చలూ, తర్జన భర్జనల తర్వాత 2005వ సంవత్సరంలో యూ.పి.ఎ. నేతృత్వంలోని ఆనాటి కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి చేతిలో వజ్రాయుధంగా సమాచార హక్కుచట్టాన్ని జారీచేసింది. చట్టం జారీచేసిన తర్వాత సదరు చట్ట సభలతోపాటు ఈ సమాచారాన్ని దేశ పౌరులందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి అప్పగించబడిందని చెప్పక తప్పదు.**



డాక్టర్ నీలం సంపత్

సమాచారమే ఇంధనమై ఆధునిక ప్రపంచ పురోగతికి ఛోదకశక్తిగా మారుతూ ఈ ప్రపంచాన్నిసమాచార ప్రపంచంగా మారుస్తున్న వైనం బహిరంగ రహస్యమే. డేటాసైన్స్, బిగ్ డేటా, డేటా టూల్స్‌ల ఆవిష్కరణలు ఈ ప్రపంచ గమనాన్ని శాసించే ప్రబలశక్తిగా సమాచారాన్ని మారుస్తున్న వైనం లోకవిదితమే. ఈ నేపథ్యంలో నూట నలభై రెండు కోట్ల పైచిలుకు జనాభా కలిగిన మన దేశంలో వారి సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన వేల, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల సేకరణ, అవసరాలకనుగుణంగా సదరు పెట్టుబడులను ఖర్చుచేయడానికి సంబంధించి ప్రభుత్వాలు రూపొందించే విధానాలకు సంబంధించిన సమాచారమే ప్రాతిపదికగా దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముడిపడివున్న నేపథ్యంలో సదరు సమాచారాన్ని స్వచ్ఛందంగా అన్ని ప్రభుత్వ పథకాల లాభానుభోక్తలైన ప్రజల ముందుంచడం ద్వారా ప్రభుత్వాలు నిధుల కేటాయింపులూ, అర్థవంతంగా వాటిని ప్రజల డిమాండ్ల కనుగుణంగా ఖర్చుచేయడానికి సంబంధించి తమ నిజాయితీని రుజువు చేసుకోవచ్చు. మన దేశంలో 1950లో మినిస్ట్రీఆఫ్ ఫైనాన్స్ ఆధ్వర్యాన ప్రారంభమైన నేషనల్ సాంపిల్‌సర్వే ఆర్గనైజేషన్ దేశంలోప్రభుత్వ, ప్రైవేటు రంగాల వర్తమాన సామాజిక, ఆర్థిక స్థితిగతుల సమాచారాన్ని గణాంకాల రూపంలోసేకరించి నిక్షిప్తం చేస్తుండడం తెలిసినదే. నిజానికి ఆ సమాచార పునాదులపైనే అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరుగుతుంది. తద్వార దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిని సాధిస్తుంది. స్వతంత్ర భారతంలో ప్రభుత్వాల స్వీయఅనుభవాన్ని బట్టి ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ పథకాల కోసం ప్రభుత్వాలు కేటాయిస్తున్న ప్రతి వంద రూపాయలలో కేవలం పదిహేను రూపాయలు మాత్రమే క్షేత్ర స్థాయిలో అంతిమ లబ్ధిదారులైన ప్రజలకు చేరుకుంటున్నాయని మిగతా ఎనభై ఐదు రూపాయలు మధ్య దళారుల దోపిడీకి గురౌతున్న వాస్తవాన్ని తొలిసారిగా రాజీవ్‌గాంధీ గుర్తించడం గమనార్హం. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కేటాయిస్తున్న వందల, వేలకోట్ల రూపాయల నిధుల పంపిణీలో వివిధ దశల్లో జరుగుతున్న అవినీతి మూలంగానే మధ్యదళారులు దోపిడీ చేయగలుగుతున్నారనేది రుజువైన సత్యమే. ఈ వాస్తవాన్ని గమనించిన ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపులు, వాస్తవిక ఖర్చుల వివరాలను పారదర్శకంగా ప్రజల ముందుంచడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చనే పాలనా నిపుణులు, బుద్ధిజీవుల డిమాండ్ మేరకు సుదీర్ఘ చర్చోపచర్చలూ, తర్జన భర్జనల తర్వాత 2005వ సంవత్సరంలో యూ.పి.ఎ. నేతృత్వంలోని ఆనాటి కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి చేతిలో వజ్రాయుధంగా సమాచార హక్కుచట్టాన్ని జారీచేసింది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో సెక్షన్ 19(1) ప్రకారం సమాచారం పొందడం ఈ దేశ పౌరుల ప్రాథమిక హక్కులలో ఒకటిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2005వ సంవత్సరంలో 6అధ్యాయాలతో 31 సెక్షన్లతో కూడిన ఈ సమాచార హక్కు చట్టాన్ని జారీ చేసింది. దీనిప్రకారం ప్రభుత్వాలు గతంలో భారత పార్లమెంట్‌కు, ఆయా రాష్ట్రాల విధానసభలు, విధాన పరిషత్‌లకు మాత్రమే సమాచారం ఇవ్వాల్సిన బాధ్యతను కలిగి వుండేవి. కాని ఈ సమాచారహక్కు చట్టం జారీచేసిన తర్వాత సదరు చట్ట సభలతో పాటు ఈ సమాచారాన్ని దేశ పౌరులందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి అప్పగించబడిందని చెప్పక తప్పదు. నిజానికి ఈ చట్టం ప్రజలను సార్వభౌమాధికారులుగా మార్చింది. స్వతంత్ర భారత దేశంలో పాలనలో గుణాత్మక మార్పుకు శ్రీకారం చుట్టిన విప్లవాత్మక చట్టాలైన రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ చట్టాల సరసన ఈ చట్టం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ప్రత్యక్షంగా ప్రభుత్వ విభా




గాలు గాని, ప్రభుత్వ ప్రత్యక్ష లేదా పరోక్ష ఆర్థిక సహాయంతో నడిచే ఏసంస్థయైనా గాని వాటికి సంబంధించిన పథకాలు, ప్రణాళికలు, ఇతర ఏ సమాచారాన్నైనా ప్రజలు ఆర్టీఐ ప్రకారం అడిగినప్పుడు తప్పని సరిగా ఇవ్వాల్సిందే. నిజం చెప్పాలంటే ప్రజలు అడగకున్నా వారిదగ్గర ఉన్న సమాచారాన్ని సిటిజన్‌ఛార్టర్ ద్వారా స్వచ్ఛందంగా ప్రజలకు వెల్లడి చేయాల్సిందే. ఈ చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచారాన్ని ఇవ్వడం కోసం ఓ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అతనికి సహాయంచేయడానికి అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అప్పిలేట్ అథారిటీలపేర్లు, మొబైల్ నంబర్లతో సహా ప్రజలందరికీ తెలిసేవిధంగా ప్రదర్శించాలి. సామాన్యుడి చేతుల్లో బ్రహ్మాస్త్రంగా భావించే ఈ చట్టంనేటికీ ఆయా రాష్ట్రాలలో త్రికరణశుద్ధితో అమలుపరిచే సమర్థులైన అంకితభావం గలిగిన సమాచార కమీషనర్‌లను నియమించడం లేదు. దీనికితోడు సామాజికస్ఫూర్తిగల సేవాకార్యకర్తలను, న్యాయనిపుణులను కాకుండా విశ్రాంత ఐ.ఏ.యస్.లను రాష్ట్రాల ఇన్ఫర్మేషన్ కమీషనర్‌లుగా నియమించడంతో వారికివి ఓ పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పక తప్పదు. సామాజిక సేవా నిరతిలేని, న్యాయపరమైన నైపుణ్యాలు లేని ఇన్ఫర్మేషన్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా, అప్పిలేట్ అథారిటీలుగా ఆయా ప్రభుత్వ, ప్రభుత్వ నిధులతో పనిచేస్తున్న సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు తగు శిక్షణను ఇవ్వకపోవడం ఫలితంగా క్షేత్రస్థాయి అధికారులు గందరగోళానికి గురౌతున్నవైనం బాధాకరమే. అంతిమంగా రాష్ట్ర కమీషన్‌ల చొరవలోపం మూలాన నేటికీ సమాచార హక్కు చట్టం ప్రయోజనాలు గ్రామీణప్రాంతాల ప్రజల గడపకు చేరకపోవడం దురదృష్టకరంగా భావించక తప్పదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా సమీప గతంలో పార్లమెంట్‌లో సభ్యులు లేవనెత్తిన కోవిడ్ మరణాలెన్ని? కరోన కల్లోలంలో ఎంతమంది డాక్టర్లు, నర్సులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది? ఎన్ని కోట్లమంది వలసకూలీలు ఉపాధిని కోల్పోయారు? రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాడుతున్న రైతుల్లో ఎంత మంది మరణించారు? అన్న ప్రశ్నలకు మా దగ్గర సమాచారమేమీ లేదని చెప్పడం దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ ప్రశ్నలన్నింటికీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వరల్డ్ హెల్త్‌ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ అన్ని జాతీయ, అంతర్జాతీయ మీడియా ఏజన్సీల దగ్గర జవాబులు అందుబాటులో వున్నప్పుడు సదరు వివరాల సమాచారమే మా దగ్గరలేదని ప్రభుత్వం చెప్పడం సమాచారాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టిందేమోననే అనుమానాలకు తావిస్తోందనే బుద్ధిజీవుల అభిప్రాయం. 2020నుండి నేటివరకు రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ పదవి ఖాళీగానేవుంది. గత 20 నెలలుగా రాష్ట్రంలోని సమాచార కమిషన్‌లో ఐదుగురు సమాచార కమిషనర్ల పదవులు సైతం ఖాళీగానే వుండడం దిగ్భ్రాంతిని గొలుపుతోంది. ఈబాధాకర పరిస్థితులను గమనించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కన్వీనర్ రెండేళ్ల క్రితమే తక్షణమే సదరు పదవులను భర్తీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాల్సిందిగా తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని వేసినదానికి స్పందనగా ఆనాటి బి.ఆర్.యస్ ప్రభుత్వం కమిషనర్‌ల నియామకానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించగా 280 మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుచేసుకున్నప్పటికీ ఎన్నికల మూలాన ప్రక్రియను పూర్తిచేయలేక పోయినామని చేతులెత్తేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమది నిజమైన ప్రజాపాలనగా తమకు తాము అభివర్ణించుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ పాలనా సౌలభ్యం కోసం ఇప్పటికే 37 నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. త్వరలో మరో 30 పై చిలుకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడానికి సిద్ధమోతోంది. కాంగ్రెసు ప్రభుత్వం నాలుగేళ్ల కాలం నుండి పెండింగ్‌లో ఉన్న ఐదుగురు సమాచార కమిషనర్లను, గత 20నెలలుగా పెండింగ్‌లో ఉన్నరాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్‌ను తక్షణమే నియామకం చేయాలి. నిజానికి ఆ క్రమంలో ఓ ముందడుగుగా ప్రభుత్వం ఈ సంవత్సరం జూన్‌లోనే సమాచార కమిషనర్ల నియామకానికి సంబంధించిన దరఖాస్తులను ఆహ్వానించడం అభినందనీయమే. ఈనేపథ్యంలో చైతన్య శీలురైన ప్రజలు ఓవిస్తృతమైన ప్రజా ఉద్యమ రూపంలో సమాచార హక్కు చట్టాన్ని అమలు పరచడానికి అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రప్రభుత్వం ముందుగాతాను చిత్తశుద్ధితో చట్టాన్నిఅమలు పరుస్తూ అన్ని రాష్ట్రప్రభుత్వాలకు ఉదాహరణగామారాలి. ●

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకం

దండంరాజు రాంచందర్ రావు

ఈ రోజుల్లో మానవుని దినచర్య ప్లాస్టిక్ వాడకంతోనే మొదలవుతున్నది. కిరాణా సామాగ్రి ప్యాకేజింగ్‌నుండి మన వంటశాలలలో నిల్వచేసే కంటైనర్ల వరకు, ప్లాస్టిక్ ప్రతిచోటా ఉంటున్నది. అయితే, ఇది మనకు సౌకర్యవంతంగా ఉంటున్న పర్యావరణానికి భూమిపైఉన్న అన్ని జీవరాసులకు పెనుముప్పుగా సంభవిస్తున్నది. మైక్రోప్లాస్టిక్‌లు ఇప్పుడు మన ఆహారం, నీరు, పీల్చేగాలిలో కూడా వ్యాపించాయని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తులను నిరుపయోగంగా ఉంచినప్పుడు అవి చిన్న కణాలుగా విచ్ఛిన్నమవుతున్నవి చివరికి మైక్రోప్లాస్టిక్‌లుగా మారతాయి. ఇవి శతాబ్దాలపాటు పర్యావరణంలో కొనసాగుతాయి. టాక్సిక్స్ లింక్ ఇటీవలి నివేదిక ఉప్పు, చక్కెర వంటి రోజువారీ ఆహార పదార్థాలలో మైక్రోప్లాస్టిక్ కాలుష్యం పరిధిని వెలుగులోకి తెచ్చింది. అయోడైజ్డ్ ఉప్పులో అత్యధిక కాలుష్యం కనుగొనబడింది. సముద్రపు ఆహారం పండ్లు కూరగాయలు ధాన్యాలు, తాగునీటిలో కూడా మైక్రోప్లాస్టిక్ కణాలను అధ్యయనాలు కనుగొన్నాయి. మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్‌ల ప్రభావం అనేది ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్న అధ్యయన రంగం అయితే ప్రాథమిక పరిశోధనలు చాలా లోతుగా ఉన్నాయి. మెక్సికో విశ్వవిద్యాలయం నిర్వహించిన పరిశోధనలో మెదడుతో సహా మానవ అవయవాలలో మైక్రోప్లాస్టిక్‌లు పేరుకుపోతాయనివెల్లడించింది. సగటు మానవ మెదడు బరువు ప్రకారం 0.5ప్లాస్టిక్‌ను కలిగి ఉంటుందని అధ్యయనం కనుగొన్నది. అటువంటి కాలుష్యం ఆరోగ్య చిక్కులు విస్తారమైనవి. ఇప్పటికీ పెద్దగా తెలియవు అయినప్పటికీ మైక్రోప్లాస్టిక్‌లు ప్రతిస్పందనలను ప్రేరేపించగలవని సెల్యులార్ ప్రక్రియలలో జోక్యం చేసుకోవచ్చని హార్మోన్ నియంత్రణకు అంతరాయం కలిగిస్తుందని రోగనిరోధక పనితీరును బలహీనపరుస్తుందని, క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మైక్రోప్లాస్టిక్‌లు మానవ శరీరంలోకి ప్రవేశించే ప్రాథమిక మార్గాలలో ఒకటి తీసుకోవడం ఉత్పత్తి ప్రాసెసింగ్ ప్యాకేజింగ్ లేదా రవాణా సమయంలో మైక్రోప్లాస్టిక్‌లతో కలుషితమైన ఆహారాన్ని మనంతినేటప్పుడు ఇది సంభవించవచ్చు. మన ఆహారంలో మైక్రోప్లాస్టిక్‌లు విస్తృతంగా ఉండేందుకు ఆహార పరిశ్రమ బాధ్యతవహిస్తుంది. ఆహార ప్రాసెసింగ్ రవాణాసమయంలో సరిపోని భద్రతాచర్యలతో కలిపి ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై అధికంగా ఆధారపడటం మైక్రోప్లాస్టిక్‌లుఆహార సరఫరాను విస్తరించడానికి అనుకూలిస్తున్నాయి. ఈసమస్యను పరిష్కరించడానికి ఆహారపరిశ్రమ తక్షణచర్యలు తీసుకోవడం అత్యవసరం. మైక్రోప్లాస్టిక్ కాలుష్యానికి దోహదపడని ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ మెటీరియల్‌లలో పెట్టుబడి పెట్టడంతోపాటు ప్రాసెసింగ్ లేదా రవాణా సమయంలో ఆహార ఉత్పత్తులు కలుషితం కాకుండా ఉండేలా కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలనుచేపట్టాలి. ప్రజలకు అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలలో ప్రభుత్వం పెట్టుబడి పెట్టాలి. ●

# ప్రజావాక్కు



### దిక్కుతోచని స్థితిలో సచివాలయ వలంటీర్లు!

రాష్ట్రంలో వలంటీర్లులేరు, వలంటీర్ల వ్యవస్థ మనుగడలో లేదు అని గ్రామ సచివాలయ శాఖామంత్రి స్వయంగా అసెంబ్లీలో ప్రకటించటంతో, తమ భవిష్యత్‌పై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. తమ భవిష్యత్ అగమ్యగోచరమై దిక్కుతోచనిస్థితిలో ఉన్న వలంటీర్లు అసలు ఈ వ్యవస్థే ఉనికిలో లేదన్న మంత్రి ప్రకటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. రాష్ట్రంలో గత వై.సీ.పీ హయాంలోవలంటీర్ వ్యవస్థ మొదలైంది. సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈవ్యవస్థను ప్రారంభించారు. గతప్రభుత్వం వలంటీర్లకు నెలకు 5 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి బండ చాకిరీ చేయించుకుంది. డిగ్రీలు, పీజీలు, బీటెక్ చేసిన యువత ప్రభుత్వ సర్వీస్ అవుతుందనే ఆశతో తక్కువ వేతనానికే పనిచేసారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం ప్రకటన ఈవిషయంలో రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో తగిన చర్యలు తీసుకోవాలి.

-దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా

### గురువులను గౌరవించండి

విద్యాబుద్ధులు నేర్పించి, సంఘంలో ఉన్నతంగా జీవించేలా చేసే గురువులు అంటే నేడు విలువ లేకుండా పోయింది. కొందరు విద్యార్థులు గురువులని అవహేళన చేస్తూ, నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, అమర్యాదగా ప్రవర్తిస్తూ, అగౌరవపరుస్తున్నారు. గురువులేనిదే తాములేము అనే విషయాన్ని మరచిపోతున్నారు. చిన్నప్పుడు చదువుకున్న గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర అనే శ్లోకాన్ని, దాని భావాన్ని అర్థం చేసుకుంటే ఎవ్వరు ఇంకెప్పుడు గురువులను అగౌరవపరచక గురువులయందు భక్తి భావనతో ఉంటారు.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### గురుకులంలో ఫుడ్ పాయిజన్

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి తాజాగా విద్యార్థిని మరణించడం దురదృష్టకరం. పేదవిద్యార్థులకు ఆలంబనగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వపాఠశాలల్లో భోజనం తరచుగా వివాదాస్పదం కావడం తీవ్ర చర్చనీయాంశం. సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

-ముత్యంరెడ్డి, అందె, సిద్దిపేట జిల్లా

### ప్రభుత్వ వసతి గృహాలలోని విద్యార్థుల అవస్థలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో గిరిజన వసతి గృహాల్లోఇటీవలకాలంలో మధ్యాహ్నభోజనంలో తలెత్తిన లోపాల వల్ల అనేకమంది విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారు. అనేక మందివివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వున్నారు. కొంత మంది చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నిరకాల సంక్షేమ హాస్టల్లో శుచి శుభ్రత లేకపోవడం భోజనంలో నాణ్యత పాటించకపోవడం వలననే పురుగుల అన్నం తినితనువు చాలిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఇట్టి విషయాన్ని సీరియస్‌గా ఆలోచించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ గిరిజన వసతి గృహాలు కస్తూర్బా మోడల్ స్కూల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలు చేసే విధంగా జాగ్రత్తలు తీసుకొని పిల్లల ప్రాణాలు కాపాడాలి.

-కామిడి సతీశ్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### ప్రభుత్వ కార్యాలయాలను తరలించాలి!

రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలు అయినా ఇంకా ఆంధ్రప్రదేశ్ కి సంబంధించిన కొన్ని కార్యాలయాలు హైదరాబాద్ నుంచే పని చేస్తున్నాయి. అలాగే కృష్ణా నది నీటి యాజమాన్య సంస్థ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కూడా హైదరాబాద్ నుంచే కార్యకలాపాలను నిర్వహించడం కొనసాగుతోంది. పాలనా సౌలభ్యం, పనులు వేగవంతం, పర్యవేక్షణ అవసరాల దృష్ట్యా ఈ కార్యాలయాలను తక్షణం రాష్ట్రానికి తరలించాలి. పాలకులు ఇక్కడ, కార్యాలయాలు వేరేరాష్ట్రాల్లో కొనసాగడం సరికాదు. ప్రభుత్వం ఇటువంటి విషయాల్లో నాన్చుడు ధోరణి వీడాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఉపాధ్యాయుల కొరత

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేదు. గంటల తరపున ఉపాధ్యాయులను వలంటీర్లుగా నియమించుకుని అరకొర జీతాలతో నెట్టుకుస్తుంది ప్రభుత్వం. ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులలో క్రమశిక్షణ లోపిస్తుంది. వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. విద్యార్థుల కొరత కారణంగా విద్యార్థులు బడి మానేసే ప్రమాదం ఉంటుంది. తల్లిదండ్రులు పాఠశాలలకు పంపడం మానివేస్తారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఇకనైనా ఉపాధ్యాయులను నియమించాలి.

-గూరుడు ప్రశాంత్, గోధుర్, జగిత్యాల జిల్లా

మీ మనవి ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జోబైడెన్ చర్యతో పెరిగిన యుద్ధ ముప్పు!

వి వి రమణ

మరో రెండు నెలల్లో గద్దె దిగబోతున్న తరుణంలో జోబైడెన్ రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో తీసుకున్న నిర్ణయం అనగా అమెరికా ఉక్రేయిన్‌కు అందజేసిన లాంగ్ రేంజ్ క్షిపణులను రష్యాపై దాడుల నిమిత్తం వాడిందుకు ఉక్రెయిన్‌కు ఆయన అనుమతి ఇవ్వడం అనేది తొందరపాటు చర్యగా భావించే పరిస్థితి కలగడంతో పాటు ప్రపంచ దేశాలకు కలవరింతకు గురిచేసిందనే చెప్పాలి. జరుగుతున్న పరిస్థితులను గమనించినట్లయితే ఇలాంటి తీవ్రఉద్రిక్తల పరిస్థితులకు ఆజ్యానికి కారణం జో బైడెన్ దే బుద్ధిహీన చర్యగా భావించాలి. అంతేగాని అమెరికాను కాదనే అభిప్రాయం కలుగుతుంది. ఎందుకంటే ప్రపంచ దేశాలు ఉక్రెయిన్ రష్యామధ్య యుద్ధం సద్దుమణిగే సమయంకోసం ఎదురుచూస్తున్న సందర్భంలో అమెరికా నూతన అధ్యక్షుడుగా పదవినలంకరించటానికి సిద్ధంగా ఉన్న ట్రంప్ ఎన్నికల సమయంలో ఉక్రెయిన్ యుద్ధం ఆపటం కోసంకృషి చేస్తానన్న హామీ ప్రపంచ దేశాలకు సాంత్వనాన్ని కలిగించాయి. అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ విజయంతో ఇంకా వెయ్యి రోజుల యుద్ధం సద్దుమనుగుతుందని ఆశిస్తున్నా ఈ సమయంలో, జో బైడెన్‌చర్య ట్రంప్‌ను ఇరుకున పెట్టినట్లుగా ఉందని భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాంతికి మరింత విఘాతం కలిగించే ఇలాంటి తీవ్రచర్యలను జూనియర్ ట్రంప్ సైతం జోబైడెన్ వర్గం నిర్ణయాన్ని తప్పుపడుతూ వారు ఇంకా యుద్ధాన్ని కోరుకుంటున్నారు అని విమర్శించటం జరిగింది. అమెరికాను శత్రుదేశంగా రష్యా భావిస్తున్నప్పటికీ, డోనాల్డ్ ట్రంప్ గెలుపు వార్తలు వచ్చిన పిదప రష్యా అధ్యక్షుడు పుతిన్‌సైతం ట్రంప్‌తో ఉక్రెయిన్‌పై చర్చలకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించడం సంతోషించ తగిన విషయం. పుతిన్, ట్రంప్ మధ్య కొంత సామరస్య సంబంధాలు బాగానే ఉన్నాయనే అభిప్రాయాలు విశ్లేషకులకుంది. ఇలాంటి సందర్భాలలో జోబైడెన్ ఉక్రెయిన్‌కు రష్యాపైలాంగ్ రేంజ్ క్షిపణులను ప్రయోగించడానికి అనుమతి ఇచ్చినందుకు ప్రపంచ దేశాలు హర్షించలేకపోతున్నాయి. ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్న విషయం విదేశాంగ శాఖ దగ్గర కూడా లేదని మాత్యుమిల్లర్ ప్రకటించిన నేపథ్యంలో జో బైడెన్‌వి సొంత రాజకీయ ఎజెండా ఉంటుందనే అభిప్రాయం కలగక మానదు ప్రపంచ ప్రజానీకానికి. ఇదే విధానాన్ని ఒకప్పుడు 1992లో నాటి రిపబ్లికన్ పార్టీకి చెందిన జార్జిబుష్ ఎన్నికల్లో ఓటమిపాలై గద్దెదిగిపోతున్న తరుణంలో సోమాలియా దురాక్రమణకు పూనుకున్నాడు. తర్వాత అధికారంలోకి వచ్చిన క్లింటన్ దానిని సరిదిద్దటానికి పూర్తిస్థాయిలో కష్టపడాల్సి వచ్చిందనీ చరిత్ర చెబుతుంది. ఇప్పుడు కూడా ఉన్న పరిస్థితుల దృష్ట్యా అదే విధంగా జరిగిందనే అభిప్రాయం కలగక మానదు. కొన్ని రోజుల క్రితం బ్రిటన్ సరఫరా చేసిన దీర్ఘ శ్రేణి క్షిపణులను స్టార్మ్‌షాడోలను ఉక్రెయిన్ రష్యాపై ప్రయోగించటానికి బ్రిటన్ అనుమతిచ్చింది. ఇలాంటి పరిస్థితులు



చాలా ప్రమాదకరమైనవి అని, అది ప్రపంచానికి ముప్పు వాటిల్లుతుందని అమెరికా రక్షణ శాఖ భావించి బైడెన్ పై తీవ్రఒత్తిడి తీసుకొచ్చి, బ్రిటన్‌ను వారించి వాటిని ప్రయోగించకుండా ఉక్రెయిన్‌కు అడ్డుపడింది అమెరికా. నాడు అంత కష్టపడిన బైడెన్ నేడు విదేశాంగశాఖకు కూడా తెలియకుండా ఇంతటి నిర్ణయం తీసుకోవడమే కాక, రష్యా సైనిక బలం ఉక్రెయిన్‌లో ప్రవేశించకుండా యాంటీ పర్సనల్ మైన్స్ వినియోగానికి సైతం ఉక్రెయిన్‌కు బైడెన్ తన రెండో అంగీకారం తెలిపినట్లు తెలుస్తుంది. జో బైడెన్ నిర్ణయాలను ముందుగానే పసిగట్టిన పుతిన్ రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాలు వినియోగించినట్లయితే అది అమెరికా, నాటో దేశాలు నేరుగా రష్యాపై యుద్ధం చేసినట్లే అనే భావిస్తామని ప్రకటించటం జరిగింది. అంతేగాక దానికి సమాధానంగా రష్యా నుండి అణు క్షిపణులను ప్రయోగించాల్సివస్తుందని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. అయినప్పటికీ జో బైడెన్ ఈ నిర్ణయం తీసుకోవడం అనేది ప్రపంచ దేశాలకు ముప్పులో దింపినట్లే అని అనుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఉక్రెయిన్ లాంగ్ రేంజ్ క్షిపణి ప్రయోగించగా దానికి బదులుగా రష్యా సైతం తన అణు విధానానికి సవరణలు చేయడం చేసింది. దీనితో యుద్ధ వాతావరణం మరింత వేడెక్కిందని నిపుణులు భావిస్తున్నారు. ఏ సమయంలోనైనా రష్యా తన అణుక్షిపణులను జారవిడవవచ్చు అనే ఊహాగానాలు ఊపొందుకునేలోపే రష్యా తన ఖండాంతర క్షిపణితో ఉక్రెయిన్‌కు సమాధానం చెప్పడంతో యుద్ధభయాలు మరింత పెరిగినట్లయింది. సహజంగా ఇలాంటి ఖండాంతర క్షిపణులకు అణ్వాస్త్రాల వంటి భారీ బాంబులను ప్రయోగించడానికి వినియోగిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా బాల్టిక్ సముద్రగర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్‌ను రష్యా ధ్వంసం చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇవి లితువేనియా స్వీడన్, ఫిన్లాండ్ జర్మనీల మధ్య ఉన్నఇంటర్నెట్ కేబుల్ సిస్టమ్. వీటి కమ్యూనికేషన్ దెబ్బతీయడానికి ఇంటర్నెట్ ట్రాఫిక్కు అంతరాయం కలిగించేందుకు, దాడిలో భాగంగా రష్యాచేసి ఉండవచ్చనే ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. అంతకుముందే పుతిన్ నాటో దేశాలపై దాడులు చేస్తామని తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో పశ్చిమ దేశాలు భయాందోళనలకు గురి అవుతున్నారు. రష్యా తప్పకుండా మరో అడుగు ముందుకేస్తుందని భావించి పలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి నాటో దేశాలు. ఈ క్రమంలో అమెరికా కీవ్‌లో తమ కార్యాలయాన్ని తాత్కాలికంగామూసివేయడం చేసింది. గ్రీస్, ఇటలీ, స్పెయిన్ సైతం అదే బాటలో అనుసరిస్తున్నాయి. నిత్యావసరాలు నిలువ చేసుకోండని స్వీడన్, ఫిన్లాండ, నార్వే, డెన్మార్క్ లాంటి నాటో దేశాలు తమ పౌరులకు తగుసూచనలు చేస్తున్నాయి. స్వీడన్‌అయితే ఏ క్షణమైనా అణుముప్పు తప్పకపోవచ్చుని ఏకంగా లక్షల కరపత్రాలను తమ ప్రజలకు తగు జాగ్రత్తలతో, సూచనలతో పంపిణీ చేసేందుకు సమాయత్తమవుతుంది. రష్యాకు ఉత్తరకొరియా మరిన్ని ఫిరంగి వ్యవస్థలను అందిస్తున్నదని దక్షిణ ఇంతటితో బైడెన్ తన చర్య ఆపితే పుతిన్ ప్రకటించినట్లుగా, ట్రంప్‌తో సామరస్య ధోరణితో ఉన్న పుతిన్ వారితో జరుపబోయే చర్చలు సఫలీకృతం కాగలదని, ఆయా దేశాలు యుద్ధాలను ఆపి శాంతివైపు అడుగులేస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ●

# ప్రధాని అభీష్టంమేరకు నడుచుకుంటా...

## సిఎం పదవిపై ఏక్‌నాథ్ షిండే స్పష్టీకరణ



**ముంబయి, నవంబరు 27:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థిఎంపిక పరంగా తాను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటానని మహారాష్ట్ర కేర్‌టేకర్ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే ప్రకటించారు.

దీనితో ఇప్పటివరకూ ముఖ్యమంత్రి పదవిపై ఉన్న సందిగ్ధానికి కొంతమేర స్పష్టత వచ్చినట్లయింది. దేశ ఆర్థికరాజధాని ముంబయి లాంటి మహానగరం ఉన్న మహారాష్ట్రలో కీలకమైన పదవికి అనుభవజ్ఞుడే ఉండాలన్నది బిజెపి అభిమతంగా ఉంది.

ఇప్పటివరకూ బిజెపి సంకీర్ణధర్మం ప్రకారమే ఏక్‌నాథ్‌షిండేను ముఖ్యమంత్రిని చేసి ఇద్దరు డిప్యూటి సిఎంలను ఏర్పాటుచేసింది. కానీ ఇపుడు మహారాష్ట్రలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపి తన ఇష్టానికి అనుగుణంగా నడుచుకునే వీలు కూడా ఉంది. అయినా కూడా సంకీర్ణ ధర్మం పాటిస్తూ అభ్యర్థి ఎంపికపై తుదినిర్ణయానికి వస్తోంది. హైకమాండ్ కనుసన్నల్లో ఫడ్నవిస్ పేరు మాత్రమే వినిపిస్తోందని, మహారాష్ట్రలో కీలకమైన పదవులు అప్పగించడమా లేక షిండేను కేంద్రానికి తీసుకుపోవడమా అన్న సందిగ్ధత వ్యక్తం అవుతోంది. అయితే షిండే తన వర్గానికి కీలక పదవులతోపాటు తన కుమారుడికి కేంద్రకేబినెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఇక అజిత్‌పవార్ విషయానికి వస్తే తాను ఫడ్నవిస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఇప్పటికే హైకమాండ్‌కు తేటతెల్లంచేసారు. ఈక్రమంలో మరోవైపునుంచి షిండే శివసేన వర్గీయులు బీహార్ ఫార్ములా పాటించాలని ఒత్తిడితీసుకురావాలని షిండేవద్ద ప్రస్తావిస్తున్నారు. అయితే ఏక్‌నాథ్‌షిండే మాత్రం పార్టీ ముఖ్యమని భవిష్యత్తులో బాలసాహెబ్ స్థాపించిన శివసేనగా మనమే కొనసాగాలంటే పరిస్థితులకు అనుగుణంగా పోవాలని కేడర్‌కు చెపుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆలోచిస్తే షిండే కొంతమేర రాజీపడి తనకు, తనతోటి సీనియర్లకు కీలకమైన కేబినెట్‌పదవులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముఖ్యమంత్రి పదవి ఎంపిక మాత్రం ప్రధాని మోడీ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటానని చెపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లీడ్‌లో బిజెపి ఉన్నందున మహారాష్ట్ర సిఎం ఎంపికలో బిజెపి ఇపుడు కీలక నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఏది ఏమైనా గురువారం తెల్లవారేసరికి నిర్ణయం వెలువడకపోతే అనిశ్చితి, ఉత్కంఠ, ఎమ్మెల్యేల్లో నిస్పృహ, మంత్రిపదవుల ఆశావహుల్లో అసహనం పెరుగుతుందనడంలో సందేహంలేదు.



## డిసెంబర్ 4న షార్ నుంచి విదేశీ ఉపగ్రహ ప్రయోగం

### ఎఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్ ద్వారా యూరోపియన్ ఉపగ్రహం నింగికి

**శ్రీహారికోట (తడ), నవంబరు 27 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇటీవల మన భారీ ఉపగ్రహం జిశాట్-20ని ఎలాన్ మస్క్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అది జరిగిన రెండువారాల వ్యవధిలో మన శ్రీహారికోట నుంచి యూరోపియన్ స్పేస్ ఏజన్సీకిచెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఈ రెండు సంఘటనలు ద్వారా విదేశీ రాకెట్లు, ఉపగ్రహాల ప్రయోగాలలో ఇతర దేశాలతోను ఇస్రో సంబంధాలు మెరుగుపరుచుకున్నట్లు స్పష్టమవుతోంది. డిసెంబరు 4న పిఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్ ద్వారా షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ప్రోబా-3ని ప్రయోగిస్తున్నారు.

ఇది ఒకే ఉపగ్రహంగా చెప్తున్నప్పటికీ మరో రెండు కీలకమైన ఉపకరణాలను అమర్చినట్లు తెలుస్తోంది. ఆక్యూటర్ మరియు కరోనా గ్రాఫ్‌ల పరిశోధనల కోసం వీటిని ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే రాకెట్ అనుసంధానం పనులు దాదాపు పూర్తి చేశారు. శ్రీహారికోటలో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు యూరోపియన్ శాస్త్రవేత్తలు కూడా సందడి చేస్తున్నారు. రాకెట్‌ను డిసెంబరు 4న సాయంత్రం 4 గంటలకు ప్రయోగించడానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.

## ఒక్కో అమెరికా పౌరుడిపై రూ.91 లక్షల రుణభారం

**వాషింగ్టన్, నవంబరు 27:** అగ్రరాజ్యం అప్పుల కుప్పగా మారుతోంది. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డొనాల్డ్‌ట్రంప్‌కు ఈ అప్పుల భారం పెద్ద సవాల్ అనే చెప్పాలి. తాజా లెక్కల ప్రకారం అమెరికారుణం ఏకంగా 36 లక్షలకోట్ల డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో ఇది అక్షరాలా 3035 లక్షలకోట్లరూపాయలు. ఈ ఏడాది రెండు లక్షలకోట్ల డాలర్ల రుణం పెరిగింది. ఇపుడు పగటున ఒక్కో అమెరికా పౌరుడిపైనా రూ.91 లక్షల అప్పు ఉన్నట్లు ఆర్థికవేత్తల గణాంకాలు చెపుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా అప్పులు ఏటేటా భారీగా పెరుగుతున్నాయి. 2000వ సంవత్సరంలో సుమారు 5.7 లక్షల కోట్ల డాలర్ల రుణం ఉంటే 2020 నాటికి 23.2 లక్షలకోట్ల డాలర్లకు పెరిగింది. కొవిడ్ మహమ్మారి అమెరికా ఆర్థిక వ్యవస్థను భారీగా దెబ్బతీసింది. దీనితో అప్పుల భారం అమాంతం పెరిగింది. కొవిడ్ మొదలైననాటినుంచి అమెరికా రుణాలు 16 లక్షలకోట్ల డాలర్లుపెరిగాయి. ప్రపంచంలోని అనేక దేశాల ఆర్థికవ్యవస్థల విలువలకంటే అమెరికా రుణభారం అధికంగా ఉంది.

ఇపుడు కొత్త అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నకు పెద్దసవాల్ అవుతోంది. వడ్డీభారంతోపాటు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ పరిణామాలనేపథ్యంలో జాతీయభద్రతకు ఖర్చు పెంచాల్సిన పరిస్థితులే రుణభారం పెరుగుదలకు దోహదంచేస్తున్నాయి. అధిక పన్నులు, వడ్డీరేట్లను తగ్గిస్తానని ట్రంప్ కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇపుడున్న పరిస్థితుల్లో ఆయనకు ఈ హామి నిలబెట్టుకోవడం మరికొంత కష్టం అవుతుందని ఆర్థికవేత్తల అంచనా.



## ట్రంప్ ప్రైవేట్ జెట్‌ను పరిచయంచేసిన ఆయన మనుమరాలు కై ట్రంప్

**వాషింగ్టన్, నవంబరు 27:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం నాటి నుంచి డొనాల్డ్ ట్రంప్ మనుమరాలు కై ట్రంప్ పేరు బాగా వినిపిస్తోంది. తాజాగా ఆమె మరోసారి వార్తల్లోకి వచ్చారు. అగ్రదేశానికి కాబోయే కొత్త అధ్యక్షుడు ట్రంప్ ప్రైవేట్ జెట్ లోపల ఎలా ఉంటుందో నెటిజన్లకు పరిచయం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను యూట్యూబ్‌లో పోస్టు చేయగా అది వైరల్ అవుతోంది. కై డొనాల్డ్ ట్రంప్‌జూనియర్ కుమార్తె. ఈ టీనేజర్ ఇటీవల తన తాతయ్యతో కలిసి స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఓ భారీ స్టార్‌షిప్ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడానికి టెక్సాస్‌లోని బ్రౌన్‌విల్లేకు వెళ్లారు. అప్పుడు ఈ ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించారు. తర్వాత రాకెట్ లాంచింగ్‌ను వీక్షించారు. దానికి సంబంధించిన దృశ్యాలను షేర్ చేసిన కై ఎలాన్ మస్క్‌తో కలిసి స్పేస్‌ఎక్స్‌లో లాంచింగ్‌ను వీక్షించాను అని రాసుకొచ్చారు. ఈ వీడియోలో కై తన స్నేహితురాలితో కలిసి జెట్ లోపల సందడి చేశారు.

## ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా కాల్పుల విరమణకు జి7 మద్దతు



**ఫియుగ్గి,(ఇటలీ), నవంబరు 27:** ఇజ్రాయెల్, లెబనాన్ మిలిటెంట్‌గ్రూప్ హెజ్‌బొల్లాలమధ్య కాల్పుల విరమణకు జి7 దేశాలు ఏకగ్రీవంగా ఆమెదం తెలిపాయి. అయితే ఇజ్రాయెల్‌పై జారీ అయిన అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టు వారంట్ మాత్రం సమావేశంలో ప్రస్తావనకు రాలేదు. జి7 దేశాల విదేశాంగమంత్రుల సదస్సులో ఈ నిర్ణయం ప్రకటించారు. గాజాపై యుద్ధంపరంగా అంతర్జాతీయ కోర్టు వారంట్‌ను అమలుచేస్తారా అన్నది ప్రశ్నార్థకమే. అయితే ఇటలీ మాత్రం జి7 సమావేశం అజెండాలో ఐసిసి వారంట్‌ను తీసుకొచ్చింది. ఈ అంశంపై సభ్యులు విడిపోయారు కూడా. ఇటలీప్రధానమంత్రి జార్జియా మెలోని ఇజ్రాయల్‌కు గట్టిమద్దతుదారుగా నిలిచారు. అదువల్లనే ఆదేశంనుంచే ముందు అజెండాలో చేర్చినట్లు తెలుస్తోంది. అమెరికా ఇజ్రాయెల్‌కు అత్యంత స్నేహపూర్వకదేశం. కోర్టుసభ్యదేశాల్లో ప్రాతినిధ్యంలేదు. అయితే ఇజ్రాయెల్‌కూడా అంతర్జాతీయంగా వస్తున్న మానవతా వాద ఉదార స్వభావాలను గౌరవించాల్సిందేనని జి7 దేశాలు చెపుతున్నాయి. జి7 సభ్యులు కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యుకె, యుఎస్ఎ దేశాలు అంతర్జాతీయ మానవతా చట్టాలకు లోబడి ఉండాలని నిర్ణయించుకున్నాయి. ఇటలీ గడ్డపై అడుగుపెడితే నెతన్యాహును అరెస్టుచేస్తారా అన్న చర్చకూడా జరిగింది.

విదేశాంగమంత్రి ఆంటోనియో టాజాని మాట్లాడుతూ కోర్టు ఏర్పాటు ఒప్పందంలో భాగస్వామ్యం లేనపుడు వారంట్లను అమలుచేయడం వీలుకాదని చెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఇదే వర్తించినపుడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు కూడా అదే అన్వయించాల్సి ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేసారు. ప్రస్తుతం జరిగే జి7 విదేశాంగమంత్రుల సమావేశం బైడెన్ హయాంలో అమెరికాకు చిట్టచివరి సమావేశం అని చెప్పాలి. ఇందుకు సంబంధించి ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాలమధ్య కాల్పుల విరమణ త్వరలోనే అమలుకు రావచ్చని జి7 దేశాలు నిర్ణయానికి వచ్చాయి. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ మాట్లాడుతూ గాజాలో కాల్పుల విరమణ ప్రతిపాదనలను మరింత వేగవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు.

## ఇస్కాన్‌ను నిషేధించాలంటూ బంగ్లా హైకోర్టులో పిటిషన్

**ఢాకా, నవంబరు 27:** బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరిచారనే ఆరోపణలపై ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ప్రభును ఢాకా విమానాశ్రయంలో పోలీసులు అరెస్టుచేసారు. అంతేకాకుండా ఇస్కాన్‌ను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ బంగ్లా హైకోర్టులో పిటిషన్‌కూడా దాఖలుచేసారు. ఇస్కాన్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారిస్తున్నట్లు ఢాకా ప్రభుత్వ వర్గాలు చెప్పాయి ఈపిటిషన్‌ను పరిగణనలోనికి తీసుకున్న హైకోర్టు దేశంలోని శాంతిభద్రతల పరిస్థితిని గురువారం ఉదయంలోగా నివేదించాలని అటార్నీ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. అక్కడి పరిస్థితులు క్షీణించకుండా చూడాలని కోర్టుప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్‌కృష్ణదాస్ గతనెలలో అక్కడ ఒక ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండానుద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. దీనితో ఢాకా విమానాశ్రయంలో ఆయన్ను పోలీసులు అరెస్టుచేసారు. మరోవైపు కృష్ణదాస్ అరెస్టును వ్యతిరేకిస్తూ పలు సంఘాలు ఆందోళనకు దిగాయి. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే హిందువులు మైనార్టీలపై తీవ్రవాద గ్రూపులు దాడులకు దిగుతున్న క్రమంలో ఈ పిటిషన్ దాఖలుచేయడం భారత్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. బంగ్లాదేశ్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మైనార్టీలపై దాడులు సరికాదని, హిందువులు,మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ అధికారులను కోరింది. బంగ్లాదేశ్‌లో హిందూ, మైనార్టీలపై దాడులు పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ రెండువేలకుపైగా దాడులు జరిగాయని అంతర్జాతీయ మానవహక్కుల వేదికలుసైతం ప్రకటిస్తున్నప్పటికీ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వంలో మాత్రం ఎలాంటి స్పందనలేదు.

## సామాజిక మాధ్యమాల వినియోగంపై చట్టం తెచ్చిన ఆస్ట్రేలియా!



**మెల్‌బోర్న్, నవంబరు 27:** పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురాబోతోంది. ఇందుకు సంబంధించిన బిల్లుకు ఆస్ట్రేలియా ప్రతినిధుల సభ బుధవారం ఆమోదం తెలిపింది. ఇక దీనికి సెనెట్ ఆమోదం తెలిపితే చట్టరూపం దాల్చనుంది. బుధవారం ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా 102 ఓట్లతో ఆమోదం పొందింది. మెజారిటీ పార్టీలు ఇందుకు అనుకూలంగా ఓటెయ్యగా సభలో 13 మంది మాత్రం వ్యతిరేకించారు. ఒకవేళ ఈ వారంలోనే ఇది చట్టరూపం దాల్చితే సామాజిక మాధ్యమాలపై ఆదేశాలు జారీ చేస్తారు. తమ ప్లాట్‌ఫామ్‌ల్లో వయో పరిమితులు ఎలా అమలుచేస్తారన్న దానిపై సామాజిక మాధ్యమాలు పనిచేసేందుకు ఒక ఏడాది పాటు సమయం ఇవ్వనున్నారు.

## విమానాలకు 994 బూటకపు బెదిరింపు కాల్స్

### పార్లమెంటులో కేంద్ర మంత్రి వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబరు 24:** భారత విమానయాన సంస్థలకు ఈ ఏడాది ఇప్పటివరకూ 994 భూటకపు బాంబు బెదిరింపులు వచ్చినట్లు కేంద్ర విమానయానశాఖసహాయ మంత్రిమురళీధర్ మోహోల్ తెలిపారు. 2022 నుంచి 2024 నవంబరు 13వరకూ మొత్తం 1143 బాంబు బెదిరింపులు నమోదయ్యాయని వెల్లడించారు. ఇలాంటి బెదిరింపులు క్రమంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసారు. అయితే బెదిరింపులకు పాల్పడుతున్నవారి ప్రాంతం గురించి సరైన సమాచారం తెలికపోవడంవల్ల దర్యాప్తులో జాప్యం జరుగుతున్నదని అన్నారు. ఇటువంటిచర్యలను కట్టడిచేయడానికి పౌర విమానయాన భద్రతామండలి ఏవియేషన్ సెక్యూరిటీ రెగ్యులేటర్ కృషి చేస్తున్నాయని మంత్రి తెలిపేర్కొన్నారు. ఇందులో భాగంగా విమానాశ్రయాలకు వచ్చే బెదిరింపులపై దర్యాప్తు చేయడంకోసం బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసామన్నారు. ఇటీవల భారత్‌కు చెందిన విస్తారా ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్,స్టార్ ఎయిర్ అలయన్స్ ఎయిర్ సహా వివిధ భారతీయ విమానయాన సంస్థలకు వరుసగా భూటకపు బెదిరింపులు రావడంతో ప్రయాణీకులు, ఎయిర్‌లైన్స్ సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దీనితో పలు సామాజిక మాధ్యమ వేదికలకు కేంద్ర ఐటిశాఖ మార్గదర్శకాలు జారీచేసింది. భూటకపు బెదిరింపులకు పాల్పడిన పులువరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసామని మంత్రి పార్లమెంటులో వివరించారు.

## కాంగ్రెస్‌కు రబ్బరుస్టాంప్‌గా ఉండే ప్రశ్నేలేదు

### ఇండియా కూటమికి టిఎంసి సంకేతాలు



**న్యూఢిల్లీ, నవంబరు 27:** మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయంతో ఇండియా కూటమిలో లుకలుకలు బయలుదేరాయి. కూటమిలో చీలికలను ముందే పసిగట్టిన తృణమూల్‌కాంగ్రెస్ కూటమిని హెచ్చరించింది. కాంగ్రెస్ నిర్ణయాలకు తాము రబ్బర్‌స్టాంప్ కాబోమని కుండబద్దలుకొట్టినట్లు స్పష్టంచేసింది. కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలను తాము వ్యతిరేకిస్తున్నట్లు టిఎంసి అధినేత్రి కూటమి నేతలకు స్పష్టంచేసినట్లు తెలుస్తోంది. విజయం పక్కా అనుకున్న హర్యానాలో ఓటమి,మహారాష్ట్రలో కూడా సీట్ల పంపకంలో వచ్చినతేడాలతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. మొదటినుంచి ఇండియా కూటమిలో వ్యతిరేక స్వరం వినిపిస్తున్న బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మరోసారి బిగ్‌బాంబ్ పేల్చారు. కాంగ్రెస్‌కు షాక్‌ఇస్తూ టిఎంసి కీలకనిర్ణయం తీసుకుంది. పార్లమెంటు సమావేశాల్లో కూటమిలో చీలికకు సంకేతాలిస్తూ కాంగ్రెస్ తీరుపై టిఎంసి నేతలు విమర్శల దాడిచేసారు.

మిత్రపక్షం కాంగ్రెస్ నిర్ణయాలకు తాము రబ్బర్ స్టాంప్ కాబోమని టిఎంసి అధినేత్రి వెల్లడించినట్లుగా పార్టీప్రకటించింది. పార్లమెంట్‌లో బెంగాల్‌ప్రజల సమస్యలను లేవనెత్తేవిధంగా సభను నిర్వహించాలనికోరింది. అవినీతిపై పార్లమెంట్‌లో చర్చకొనసాగిస్తూనే రాష్ట్రప్రజల కోసం తాము చర్చలు కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. బెంగాల్‌కు నిధుల కొరత ఉందని, కేంద్రంనుంచి రావాల్సిన నిధులు రాలేదని, అనేక సమస్యలున్నాయని, వాటిని పార్లమెంట్‌లో చర్చించాలనుకుంటున్నామని టిఎంసి ఎంపిలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, అటు సార్వత్రిక ఎన్నికల్లోకూడా టిఎంసి ఘనవిజయం సాధించింది. మొత్తం 40 స్థానాల్లో 29 స్థానాలు గెలిచింది. ఉప ఎన్నికల్లో మొత్తం అసెంబ్లీ స్థానాలనుగెలుచుకుంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేసి ఓటమి పాలవడంపైనా టిఎంసి ఘాటైన విమర్శల దాడిచేసింది. దీనికితోడు కాంగ్రెస్ తమకు ఎన్నికల భాగస్వామి కానేకాదని ఇండియా కూటమిలో సభ్యులయినంతమాత్రాన కాంగ్రెస్ చెప్పినట్లు నడుచుకోవాలని లేదని కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలను ఆమోదించలేమని అధినేత్రి మమతా బెనర్జీ తమ ఎంపిలకు సూచించినట్లు సమాచారం.

## పికప్‌వ్యాన్, ట్రక్కు ఢీ

### నలుగురుమహిళల మృతి

### 16 మందికి తీవ్రగాయాలు



**అహ్మదాబాద్, నవంబరు 24:** పికప్‌వ్యాన్,ట్రక్కు ఢీకొన్న సంఘటనలో నలుగురు మహిళలు దుర్మరణం పాలుకాగా మరో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గుజరాత్‌లోని సురేందర్ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. స్థానిక పోలీస్ ఇన్‌ఛార్జి ఐబివాల్వి మాట్లాడుతూ చోటిలా ప్రాంతంలో ఈప్రమాదం జరిగిందని చెప్పారు. వ్యాన్‌లో 20 మంది ప్రయాణిస్తున్నారని, ప్రమాదం జరిగిన వెంటనే తీవ్రగాయాల పాలయివారు ఆసుపత్రికి వెళ్లారన్నారు. వారికి చికిత్స జరిగిందని తెలిపారు. ఇద్దరు మహిళలు స్పాట్‌లోనే చనిపోయారని,మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరారని, వారు కూడా మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టంకోసం పంపించినట్లు తెలిపారు. రోడ్డుసైడు ధాబావద్ద ఆగేందుకు ట్రక్కు కుడివైపునకు తిరిగిందని, అదేనక్రమంలో వ్యాన్ ఎదురుగా వస్తోందని, అదుపు తప్పి ట్రక్కును ఢీకొన్నట్లు తెలిపారు. గాయాల పాలయినవారు రాజ్‌కోట్‌ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారని, మృతుల్లో 72 ఏళ్ల మాగ్జిబెన్ రెథారియా, 60 ఏళ్ల గాలాల్‌బెన్ రెథారియా, 65 ఏళ్ల మంజూబెన్ రెథారియా, 68 ఏళ్ల గౌరీబెన్ రెథారియాలున్నారని తెలి పారు.

అంతకుముందు ఇదే నెలలో 18వ తేదీ ఆరుగురు చనిపోయారు. వారిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. మరో నలుగురు గాయపడ్డారు. ఒక ప్రైవేటు వ్యాన్ గుజరాత్‌లోని భారుచ్‌జిల్లాలో ఒక ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదంజరిగింది. కాగా బుధవారంనాటి ప్రమాదంలో 20 మంది ప్రయాణీకులు లింబ్డి తాలూకాలోని షియాని గ్రామంనుంచి సోమనాథ్‌కు వెళుతున్నారని పోలీసులు తెలిపారు.

## సనాతన ధర్మరక్షణబోర్డు ఏర్పాటుకు దాఖలైన పిటిషన్ కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, నవంబరు 27:** సనాతన్‌ధర్మరక్షా బోర్డు ఏర్పాటును కోరుతూ దాఖలయిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్నిఢిల్లీ హైకోర్టు బుధవారం తోసిపుచ్చింది. అలాంటి బోర్డు ఏర్పాటుచేయాలని తాము అధికారులను ఆదేశించలేమని విధానపరమైన నిర్ణయం అవుతుందని కోర్టుకు రావడంకంటే ముందు ప్రభుత్వాన్ని సంప్రదించాలని చీఫ్‌జస్టిస్‌మన్మోహన్ సారథ్యంలోని ధర్మాసనం స్పష్టంచేసింది. మీరు ప్రభుత్వం వద్దకు వెళ్లండి. మేం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేం. వాళ్లు ఈ అంశాన్ని పార్లమెంటులో చర్చిస్తారు. ఈ విషయమంలో మేం చేయగలిగేది ఏమీలేదుఅని జస్టిస్ తుషార్‌రావ్ గేదెల అన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదన వినిపిస్తూ ఇతర మతాల్లో వారికి సంబంధించిన బోర్డులున్నాయని, ఇతర మతాలను అనుసరించేవారినుంచి రక్షణకోసం బోర్డు అవసరం ఉందనిఅన్నారు. తమ విజ్ఞప్తిపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాలేదని కోర్టుకు తెలిపారు. అయితే పిటిషనర్‌కోరినట్లు తాము ఆదేశాలివ్వలేమని కోర్టువెల్లడించింది. ప్రభుత్వాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛఇస్తూ పిటిషన్‌ను క్లోజ్‌చేస్తున్నట్లు స్పష్టంచేసింది.

## బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై పెరుగుతున్న దాడులు

**ఢాకా, నవంబరు 27:** బంగ్లాదేశ్‌లో మైనార్టీలపరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని ఆదేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి హసన్‌మహమూద్ ఆందోళన వ్యక్తంచేసారు. భారత్‌పై వ్యతిరేక ప్రచారాన్ని పెంచడం, తీవ్రవాద శక్తులనుప్రోత్సహించడం వంటివి బంగ్లాదేశ్‌ను పూర్తి అరాచకంగా మారుస్తున్నాయని చెప్పారు. మహమ్మద్‌యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చర్యలే ఇందుకుకారణమని విమర్శించారు. ఇస్కాన్ ప్రతినిధిచిన్మయ్‌కృష్ణదాస్‌ప్రభు అరెస్టు అనంతర పరిణామాలపై ఆయన స్పందించారు. ప్రస్తుతం ఆదేశంలోపరిస్థితులు అధ్వాన్నంగా మారాయని, హిందూ,బౌద్ధ దేవాలయాలపై తరచూ దాడులు జరుగుతున్నాయన్నారు.



దేశంలో ఎక్కడో ఒకచోట మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, షేక్‌హసీనా రాజీనామా అనంతరం గతంలో నిషేధానికి గురైన బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీ వంటి తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతున్నాయని అన్నారు.

ఈ తీరును చూస్తుంటే మైనార్టీ వ్యతిరేక భావజాలం పెరుగుతున్నట్లు స్పష్టం అవుతున్నదన్నారు. హసీనా కేబినెట్‌లో సీనియర్ మంత్రిగాపనిచేసిన ఆయన ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. హసీనా వెళ్లినతర్వాత దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని, అదే సమయంలో తీవ్రవాద సంస్థలు రెచ్చిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. వీటిలో విదేశీ జోక్యం ఉందని ఆరోపించిన ఆయన ఢాకాలోని పాక్ రాయబార సంస్థముందు చోటుచేసుకుంటున్న కార్యకలాపాలనుదహరించారు. కొన్ని తీవ్రవాద సంస్థలతో పాకిస్థాన్ సన్నిహితంగా మెలుగుతోందని బంగ్లా విదేశాంగమంత్రి ఆరోపించారు.

## ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

### నలుగురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ మృతి



**లక్నో, నవంబరు 24:** లక్నో, ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం ఉదయం జరిగినరోడ్డుప్రమాదంలో నలుగురు డాక్టర్లు, ఒక ల్యాబ్ టెక్నీయషన్ మృతిచెందారు. వీరంతా కూడా ఉత్తరప్రదేశ్ వైద్య విశ్వవిద్యాలయానికి చెందినవారని సైఫాయినుంచి కారులో వెళుతున్నట్లు పోలీసులు తెలిపారు. అత్యంత వేగంగా వస్తున్న ఎస్‌యువి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఎదురుగా వస్తున్న ఒక ట్రక్కును ఢీకొని ఎస్‌యువి నిలిచింది.

ఎస్పీ అమిత్‌కుమార్ ఆనంద్‌మాట్లాడుతూ తెల్లవారుఝామున మూడు గంటలకు ఈ ప్రమాదం జరిగిందని, ఎస్‌యువి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు అక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మరోవ్యక్తి పిజి విద్యార్థి తీవ్రగాయాల పాలయినట్లు తేలింది. ఆతడిని భీమ్‌రావ్ అంబేద్కర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో చేర్చామన్నారు. మృతులు ఆగ్రాకు చెందిన 29 ఏళ్ల అనిరుధ్‌వర్మ, డాక్టర్ సంతోష్‌కుమార్‌మౌర్య, కన్నౌజ్‌కు చెందిన డా.అరుణ్‌కుమార్, బరేలికి చెందిన డా.నర్దేవ్‌లు కాగా ల్యాబ్‌టెక్నిషియన్ వయసు 38 ఏళ్లనితెలిపారు. సర్కిల్ అధికారి డా.ప్రియాంక బాజ్‌పాయ్ మాట్లాడుతూ తీవ్రగాయాల పాలయిన జైవీర్‌సింగ్ (39)మొరాదాబాద్‌కు చెందినవాడని, ఆతడిని తిర్వా వైద్యకళాశాలలో చేర్చామని తెలిపారు. మృతదేహాలను పోస్టు మార్టంకు పంపించినట్లు తెలిపారు.



# అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్‌లను కలిసిన టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు27:** టీటీడీ నూతన చైర్మన్ బి ఆర్ నాయుడు తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. బుధవారం సాయంత్రం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్‌లను అసెంబ్లీస్పీకర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ అసెంబ్లీకి విచ్చేసిన టిటిడి చైర్మన్‌ను లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమల వెంకటేశ్వరస్వామివారి దర్శనం కోసం వస్తున్నందున తెలంగాణ రాష్ట్ర శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా కోరారు. సాను కూలంగా స్పందించిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, లేజిస్లేచర్ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎంవిఐ, ఎఎంవిఐల ఫీల్డ్ శిక్షణకు నిధులివ్వండి

## కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి పొన్నం విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త :** తెలంగాణలో ఎంవిఐలు, ఎఎంవిఐలకు నాణ్యమైన సాంకేతిక ఫీల్డ్ శిక్షణ ఇవ్వడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్రంలో 37 ఆటోమేటెడ్ వెహికిల్ ఫిట్‌నెస్ టెస్టింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం బుధవారం కేంద్రమంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రవాణా శాఖ వాహనాల రిజిస్ట్రేషన్లను వాహన్ పోర్టల్‌కు డ్రైవింగ్ లైసెన్సులు, సారథి పోర్టల్‌కు మార్చడం, వాహన స్క్రాపింగ్ సౌకర్యాల ఏర్పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల ఏర్పాటు రోడ్డు భద్రత కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. రెండు రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ కేంద్రాలు ఇప్పటికే ఆమోదింపబడ్డాయనీ, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం, కొనుగోలును ప్రోత్సహించడానికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఇటీవల 40 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామనీ, అక్కడ ఢిల్లీలోని ఐడిఐఆర్ తరహాలో 15వ ఫైనాన్స్ కమిషన్ కింద హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాలో డ్రైవర్లకు శిక్షణకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ ఏర్పాటుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. బహుళ లేన్ ఆటోమేటిక్ వెహికిల్స్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌ను నిర్మించడానికి అనుమతి ఇవ్వాలనీ, రోడ్ సేఫ్టీ కోసం పబ్లిక్ వాహనాల పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలనికోరారు. ఇవి చార్జింగ్ స్టేషన్ల స్థాపనకు భారీ డిమాండ్, ఎప్ప టికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతితకతను దృష్టిలో ఉంచుకుని సహకరించాలనీ, అందుబాటులో ఉన్న 21 డ్రైవింగ్ టెస్టింట్ ట్రాక్‌లను ఆటోమేట్ చేయడానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా తన నియోజకవర్గం హుస్నాబాద్ లో పలు సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరిం చేందుకు నిధులు మంజూరు చేయాలనీ, మంత్రి పొన్నం కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. మంత్రి వెంట ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రఘురాం రెడ్డి, వంశీకృష్ణ, సురేష్ షెట్కార్ ఉన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

# లగచర్ల గిరిజనులపై దాడి వాస్తవం

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** లగచర్లలో గిరిజనులపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారన్నది వాస్తవమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కొంతమంది పోలీసులు మద్యం మత్తులో ఇండ్లలోకి చొరబడి మహిళలని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్టు కొట్టినట్లు అక్కడి గిరిజన రైతులు, మహిళలు తమతో చెప్పినట్లు పేర్కొన్నారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడిస్తూ బూటుకాళ్లతో చెప్పుకోలేని చోట తన్నారని కూడా మహిళలు విలపించినట్లు తెలిపారు. అంతేకాకుండా భూమిలిచ్చేందుకు సిద్ధంగా లేమని చెప్తున్నారని తెలిపారు. అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. ఈ విష యంపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా ఎస్సీ, ఎస్టీ కమిషన్ తీసుకెళ్లాలని నిర్ణయించిందని వెల్లడించారు. ఇటీవల లగచర్ల గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను తమ కమిషన్ సందర్శించిందన్నారు. సంగారెడ్డి జైల్లో ఉన్న గిరిజనరైతులను స్వయంగా వెళ్లి కలిసిందని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి

## ముగ్గురికి తీవ్ర గాయాలు

**అల్లాదుర్గం, నవంబరు 26, ప్రభాతవార్త:** హైవే బ్రిడ్జిని కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీ కొడుకులు మృతి చెందిన సంఘటన పోలీసు ఠాణా సమీపంలోని 161వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం రాజశేఖర్, తండ్రి శివరాజ్, తల్లి లక్ష్మీబాయి, తమ్ముడి భార్య అరుణ, కూతురు అనన్యలతో కలిసి బుధవారం హైద్రాబాద్ నుంచి బోధన్‌కు కారులో వెళుతుండగా మండల కేంద్రమైన అల్లాదుర్గం వద్దకు చేరుకోగానే బ్రిడ్జికి కారు బలంగా ఢీకొందన్నారు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ రాజశేఖర్ మరణించాడన్నారు. మెరుగైన చికిత్స కోసం జోగిపేట ఆసుపత్రి నుంచి సంగారెడ్డి అసుపత్రికి తరలించగా తండ్రి శివరాజ్ కానరానిలోకాలకు చేరిపోయాడన్నారు. మృతుడు శివరాజ్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా గుర్తించారు. రోడ్డు ప్రమాదానికి గురైన వారందరూ నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందినవారన్నారు. మృతుడు రాజశేఖర్ సోదరుడు దేశ్‌ముఖ్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీన్‌రెడ్డి వివరించారు.



ప్రమాదానికి గురైన కారు



# అలవికాని హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్

## మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అలవికాని హామిలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు. బుధవారం బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజాస్వామిక ప్రభు త్వం వస్తుందని ఆశించిన ప్రజలకు గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారిం దన్నారు. మార్పు రావాలి కాంగ్రెస్ రావాలనే అబద్ధపు నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెట్టిందన్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో అబద్ధపు హామీల పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించింది. కానీ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని అన్నారు. భారతీయ జనతా పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, డిసెంబరు 15లో కులగణన పూర్తిచేసి జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం మేర బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళన జరగాల్సిందే. కాని నిబద్ధతతో వ్యర్థాలను మళ్లించేలా శుద్ధీకరణ పూర్తిచేయాలని, నిర్వాసితులకు సరైన న్యాయం చేసి మూసి ప్రక్షాళనసుం దరీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

# క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

## 95 అసెంబ్లీ నియోజకవర్గాలు, జిహెచ్ఎంసి పరిధిలో 200 ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు

## క్రిస్మస్ సెలబ్రేషన్ కమిటీ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



బుధవారం క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు27:** ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణపై బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెలెబ్రేషన్ కమిటీ సభ్యులు, ఉన్నత అధికారులతో సమీక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండు వందల ప్రాంతాలు, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. క్రిస్మస్ వేడుకలు నిర్వహణ సందర్భంగా జిహెచ్ఎంసి తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు సిఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం హాజరవుతున్న వేడుకలకు రాష్ట్రంలో ఉన్న అన్ని చర్చిల అధిపతులు పాల్గొనే విధంగా చూడాలన్నారు. అన్ని చర్చిల అధిపతులకు, క్రైస్తవ మత పెద్దలకు క్రిస్మస్ వేడుకల ఆహ్వానాలను అందజేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కు సూచించారు. సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్, లిట్రరీ, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ రంగాల్లో అవార్డులకు ఎం పికైన వారికి సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయలు, అదే విధంగా సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్ అవార్డులకు ఎంపికైన సంస్థలకు రూ.2లక్షల చెక్కులను అందిస్తామన్నారు. అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రధాన పత్రికల్లో నోటిఫికేషన్ వేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబితను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే విందుకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు.


ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి ఆనంద్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఎక్బాల్, జీఏడి డైరెక్టర్ ఎస్.వెంకట్రావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ ఎండీ కాంతి వెస్లీ, మాజీ ఎమ్మెల్యే క్రిస్టెన్ లాజరస్, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబిత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పండగే

## రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

## షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

**షాద్‌నగర్, నవంబరు 27 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పండగేనని దేశంలో ఎక్కడా లేని విధంగా 22 లక్షల మంది రైతులకు 18వేల కోట్లు రుణమాఫీ చేశామని, త్వరలోనే పాలమూరు జిల్లాలో జరిగే రైతు పండగ ద్వారా రుణమాఫీ అందని రైతులకు అందరికీ మూడువేల కోట్ల రూపాయలను అందజేయబోతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నూతన మార్కెట్ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి తుమ్మల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బీష్వ కిష్టయ్య, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారోత్సవ సభలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా మహ్మద్ అలీఖాన్ బాబర్‌లతో పాటు మరో 12 మంది డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి మార్కెట్ యార్డు వరకు మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే శంకర్ వేలాది మంది కార్యకర్తలు, రైతులతో కలిసి రోడ్డుషో ద్వారా కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందని, వాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వడ్డీలు చెల్లిస్తూ పరిపాలనను కూడా సజావుగా సాగిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవ సాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ 47 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించారని కొని యాడారు. రంగారెడ్డి జిల్లా కొహెడలో వెయ్యి కోట్లతో నిర్మించనున్న మోడల్ మార్కెట్ ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందన్నారు.



బుధవారం మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్ పర్సన్ సులోచన రెడ్డి

**షాద్‌నగర్‌కు మంత్రి తుమ్మల వరాల జల్లు:** స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రి తుమ్మలను ప్రాంత అభివృద్ధి కోసం కొందుర్గు మండల వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీని అదనంగా ఏర్పాటు చేయా లని కోరారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో రైతుల సంక్షేమం కోసం పంటలను నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించగా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎంతో గొప్ప అభివృద్ధి సాధిస్తున్న ఈ ప్రాంతాన్ని తాను ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే శంకర్ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కమిటీకి మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే శంకర్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్.. ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించిన నారాయణ పూర్వ విద్యార్థి రోహిత్

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇంజనీరింగ్ ఎగ్జామ్(ఐఈఎస్) 2024 (సివిల్ ఇంజనీరింగ్)లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధజంచి నారాయణ స్కూల్ పూర్వ విద్యార్థి రోహిత్ ధొండ్గే సంచలనం సృష్టించాడు. అంకితభావం, నిరంతర సాధన, అసాధారణ ప్రతిభతో ఈ రికార్డును సొంతం చేసుకున్నాడని నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. రోహిత్ ఆలండియా టాప్ ర్యాంక్ సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం మాట్లాడుతూ నారాయణ స్కూల్‌లోని బేసిక్ కాన్సెప్ట్స్‌పై వేసిన స్ట్రాంగ్ ఫౌండేషన్, నారాయణ ప్రోగ్రామ్స్, టీచింగ్ రోహిత్ విజయానికి ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు. రోహిత్ విజయం ఎందరో యువ మనస్సుల్లో స్ఫూర్తిని నింపుతుందన్నా౹. వారి వారికలలను సాధించడానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. రోహిత్ తన విద్యా ప్రయాణంలో అద్భుతమైన, ఆదర్శప్రాయమైన విజయాన్ని కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఇంజనీరింగ్ పట్ల మక్కువ, క్రమశిక్షణ, ఏకాగ్రతే రోహిత్‌కు ఈ గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు మరియు విద్యార్థులు రోహిత్ ధొండ్గే మరియు అతని కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రోహిత్ ఇలాగే అద్భుత విజయాలను సాధించాలని కోరారు. ఉన్నత స్థాయితో పాటు ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తున్నట్టు నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ డాక్టర్ పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ తెలిపారు. అతని విజయం నిస్సందేహంగా ఎందరో యువ ఔత్సాహికులను ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. అలాగే ఎప్పటిలాగే నారాయణ స్కూల్‌లో నాణ్యమైన విద్యను అందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు ప్రతి రంగంలో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# ఎఇ పోస్టులకు నేడు సర్టిఫికెట్ పరిశీలన

## హాజరు కాని వారికి 29న అవకాశం

## షెడ్యూల్ ప్రకటించిన టీజీపీఎస్సీ

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లలో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకి ఎంపికైన అభ్యర్థులకి రెండో విడతలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ప్రకటించింది. గురువారం కమిషన్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపింది.

ఎవరైనా ఏదైనా కారణాలతో గురువారం(నవంబర్ 28) హాజరు కాకపోతే శుక్రవారం(నవంబర్ 29)న నిర్వహిం చనున్నట్టు కమిషన్ ప్రకటించింది. అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలు నుంచి హాజరు కావాలని సూచించారు.

# ద్రోన్ల వాడకం, మొక్కజొన్న సాగుపై అవగాహన

## వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్,నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, జీరో టిల్లేజి విధానంలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పించినట్లు వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ గోపీ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సహకారంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో రైతులతో రైతు నేసం కార్యక్రమాన్ని ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ రైతు నేస్తం కార్యక్రమం కింద 34 ఎపిసోడ్‌లను నిర్వహించి సంబంధిత వ్యవసాయ అంశాలపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని వివరించారు. ప్రధానంగా వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రమైన ప్రస్తుత నేపధ్యంలో దాన్ని అధిగమించేందుకు డ్రోన్ల వినియోగం ఒక పరిష్కారమని పేర్కొన్నారు. అలాగే జీరో టిల్లేజి విధానంలో మొక్కజొన్న సాగును చేపట్టినట్లయితే తక్కువ కూలీలు, తక్కువ ఖర్చు అవుతుందన్నారు. అంతేకాకుండా తద్వారా పైర్లు సాగుతో రైతులకు తక్కవ పెట్టుబడి అయి, పెట్టుబడి ఖర్చులు తగ్గుతా యని స్పష్టం చేశారు. ఈ విధానంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్న చింతకాని మండటానికి చెందిన అభ్యుదయ రైతు నరసింహారావు రాష్ట్రంలోని తోటి రైతులతో తన అనుభవాలను పంచుకున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.



# సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ట్రైనీ ఐపిఎస్ అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు27:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ కేడర్ 2023,2024 బ్యాచ్‌ల ట్రైనీ ఐపిఎస్ అధికారులు మర్యాదపూర్వకంగాకలిశారు. బుధ వారం జూబ్లీహిల్స్ సిఎంనివాసంలో జరిగిన భేటీలో సిఎస్ శాంతికుమారి కూడా ఉన్నారు.

# సిఎం రేవంత్‌ని కలిసిన ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు27:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ మర్యాద పూర్వకంగా కలిశారు.

బుధవారం జూబ్లీ హిల్స్ లోని సీఎం నివాసంలో జరిగిన భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఆర్పీవో స్నేహజతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలం గాణలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల పట్ల ఇజ్రాయెల్ రాయబారి ఆసక్తి కనబరిచారు.

# విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలపై డిజిపికి లేఖ

## కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన బిసి కమిషన్

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణను నిర్వహించింది. బహిరంగ విచారణాలలో (పబ్లిక్ హియరింగ్స్) లలో భాగంగా కొన్ని సమస్యలు కమిషన్ దృష్టికి వచ్చినట్టు కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

వాటిల్లో ముఖ్యంగా గ్రామాభివృద్ధి కమిటీల (విలేజ్ డెవలప్మెంట్ కమిటీ) పేరుతో బీసీ వర్గాల ప్రజలను సామాజిక బహిష్కరణకు గురిచేస్తున్న ఉదంతాలు నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో జరిపిన బహిరంగ విచారణల్లో సామాన్య ప్రజానీకం, కుల సంఘాలు కమిషన్ దృష్టికి తీసుకువచ్చాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన కమిషన్ ఛైర్మన్ నిరంజన్... ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఇటువంటి హేయమైన చర్యలను అరికట్టాలని, ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా ఉండేందుకు చట్టబద్ధత లేని ఇలాంటి కమిటీలపై కఠిన చర్యలను తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాసినట్టు కమిషన్ ప్రకటించింది.

ఇకపై వీడీసీల ఆగడాలు ఎక్కడా కనిపించకుండా చూడాలని లేఖలో కోరారు. ఈ విషయాలను సీరియస్‌గా తీసుకున్న నేపథ్యం లోనే నేరుగా డీజీపీకి లేఖ రాసినట్టు కమిషన్ స్పష్టం చేసింది.

# నిర్మల్ ఆర్డీవోపై దాడిని ఖండిస్తున్నాం

## డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త :** నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణి పట్ల ఆందోళనకారులు వ్యవహరించిన తీరు బాధాకరమని డిప్యూటీ కలెక్టర్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో నిర్మల్ ఆర్డీవో కల్యాణి అనారోగ్యంతో ఉన్నప్పటికీ చూడకుండా కారులోనే నిర్బంధించడానికి ఖండిస్తున్నట్లు తెలిపారు. నిన్న లగచర్ల, నేడు దివావర్‌పూర్‌లో రెవెన్యూ అధికారుల పట్ల ఆందోళనకారులు వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని లచ్చిరెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ నేత హనుమంతరావు కారును ధ్వంసం చేసిన దండుగులు

**హైదరాబాద్,నవంబరు 27,ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. హైదరాబాద్ బాగ్ అంబర్‌పేటలో వీహెచ్ ఇంటి ముందు పార్క్ చేసిన కారును బుధవారం తెల్లవారుజామున దుండగులు ఓ వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు అంబర్‌పేట్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీహెచ్ ఫిర్యాదుతో అంబర్‌పేటలోని ఆయన నివాసానికి వచ్చిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించారు. కారు నంబర్ ప్లేట్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కాగా, ఈ ఘటనపై వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి అని వీహెచ్ తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



# ప్రజాసమస్యలపై పోరాడండి

### కేంద్రప్రభుత్వ పథకాలు అమలుచేయండి

### డిసెంబరు నాటికి కొత్త అధ్యక్షుడు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడిని కలిసిన రాష్ట్ర బిజెపి నేతలు



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని కలిసిన తెలంగాణ బిజెపి ఎంపిలు

**హైదరాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల సమస్యల మీద పోరాటం చేయాలని, కేంద్రప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మకంగా పనిచేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడి రాష్ట్ర నేతలకు దిశానిర్దేశనం చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర బిజెపి పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులందరం ప్రధానమంత్రి నరేంద్రమోడిని కలిసామని తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధాని అపాయింట్‌మెంట్ కోరితే బుధవారం ప్రధాని సమయం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయని ప్రధానమంత్రి అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా ప్రాజెక్టుల అమలుకోసం, ప్రొయాక్టివ్‌గా పనిచేయాలని ప్రధాని సూచించారని తెలిపారు. ప్రజాసమస్యల మీద ఎప్పుడూ పనిచేయాలి, ప్రభుత్వంతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారని తెలిపారు. ఎనిమిది మంది లోకసభ సభ్యులం, రాజ్యసభ్యుడైన డా.లక్ష్మణ్, ఏడుగురు శాసన సభ్యులు, ఒక ఎమ్మెల్సీ అందరం కలిశాం. బిజెపి శాసనసభా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి కూతురు వివాహ పనులున్నందున హాజరు కాలేదని తెలిపారు. గతేడాది డిసెంబర్ 7వ తేదీన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. వారం, పదిరోజుల్లో సంవ త్సరం పూర్తికానుంది. ఎన్నికలకు ముందు హామీలు, డిక్లరేషన్లు, గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. సమస్యల మీద మాట్లాడితే, వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి దాడి చేస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తరహాలో సిఎం రేవంత్ వ్యవహరిస్తున్నారు. మూసి మీద ఆందోళన చేస్తే వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారే తప్ప సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఈ యేడాదికాలంలో మీరేం పనిచేశారో చెప్పాలని డిమాండ్ చేశాం. 7వ ప్రమాణ స్వీకారం చేస్తాం, 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. డిసెంబర్ 9న పింఛన్లు పెంచుతామన్నారు? ఏమైంది? వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు, యేడాదిలో 420కి పైగా సబ్ గ్యారెంటీలు పూర్తిచేస్తామని చెప్పారు. ఏమైంది. ఇది పూర్తి వైఫల్యం. మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగ యువత.. విద్యారంగం ఇవాళ అన్ని రంగాల్లో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. ఇవేవి సాధించలేదని మండిపడ్డారు. కానీ వారంరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు. యేడాదిలో ఏం సాధించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు, వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, గాలిమాటలు తప్ప.. ఈ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ సాధించిందేమీ లేదన్నారు. నేను సమస్య గురించి మాట్లాడితే కిషన్‌రెడ్డి డిఎన్‌ఏ ఏమిటని అడుగుతున్నారు. నా డిఎన్‌ఏ బిజెపి డిఎన్‌ఏ మీలాగా పది పార్టీలు తిరిగిన డిఎన్‌ఏ కాదు అన్నారు.

బిజెపి పార్టీ తరపున కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలమీద డిసెంబర్ 1 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతాం. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం. నాలుగైదు నెలలుగా రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువుకునే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. అనేక రకాలుగా సంఘటనలు జరుగుతున్నాయి. విపక్షాలను తిట్టడం మీద పెట్టే దృష్టి పాలనమీద పెడితే రాష్ట్రం పరిస్థితి బాగుంటుందన్నారు. కాని సిఎం దీన్ని పట్టించుకోవడం లేదు. రెండురోజుల క్రితం కొమురం భీం జిల్లాలో శైలజ అనే అమ్మాయి ఫుడ్ పాయిజనింగ్‌తో చనిపోయింది. దీని మీద సిఎం కనీసం దృష్టిపెట్టలేదన్నారు. అందుకే బిజెపి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఇప్పటికైనా నిర్మాణాత్మకంగా పాలనమీద దృష్టిపెట్టాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించాలి. ఎవరైనా సమస్య మీద మాట్లాడితే వ్యక్తిగతంగా విమర్శించే ప్రయత్నం, దిగజారి మాట్లాడే ప్రయత్నం సరికాదన్నారు. డిసెంబర్ చివరి నాటికల్లా సంస్థాగత ఎన్నికలు పూర్తవుతాయి. పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందన్నారు.

# బాయ్‌ఫ్రెండ్ వేధింపులతో పైలట్ ఆత్మహత్య



**న్యూఢిల్లీ, నవంబరు 27:** ఎయిరిండియాలో పైలట్‌గా పనిచేస్తున్న 25 ఏళ్ల సృష్టితులి ఈనెల 25న ముంబయిలోనిఅంధేరి ఈస్ట్‌లోని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆమె బాయ్‌ఫ్రెండ్ ఆదిత్యపండిట్ తరచూ ఆమెను వేధించేవాడని, ఆమెపట్ల అనుచితంగా ప్రవర్తించేవాడని సృష్టికుటుంబం ఆరోపించింది. మాంసాహారం తినవద్దు అంటూ కట్టడిచేసేవాడని తెలిపింది. ఆతడే హత్యచేసి ఉంటాడని ఫిర్యాదు చేయడంతో 26వ తేదీ కేసునమోదుచేసిన పోలీసులు పండిట్‌ను అరెస్టుచేసారు. కోర్టు ఆతడిని నవంబరు 29వరకూ పోలీస్ కస్టడీకి పంపించింది. మృతదేహంవద్దకానీ, ఫ్లాట్‌లో కాని ఎలాంటి నోట్ లభించలేదని తేలింది. యుపికి చెందిన సృష్టి తులి కమర్షియల్ పైలట్‌లైసెన్స్ కోసం శిక్షణ పొందుతున్న సమయంలో ఆమె పండిట్‌లు ఢిల్లీలోకలిసారు. ఆపరిచయం ప్రేమగా మారిందని, అయితే ఈ శిక్షణలో ఆదిత్యపండిట్‌పైలట్‌గా ఎంపికకాలేదు. ఆత్మహత్యకు ముందు సుమారు ఐదునుంచి ఆరురోజులపాటు పండిట్‌సృష్టితోకలిసి అంధేరి ఫ్లాట్‌లోఉన్నాడు. 25 అర్ధరాత్రి దాటాకా ఆతడు కారులో ఢిల్లీకి బయలుదేరాడు. ఈ సమయంలోనేసృష్టి ఆతడికిఫోన్‌చేసి ఆత్మహత్యచేసుకుంటాననిచెప్పింది. ఆతడు ముంబయికి తిరిగి వచ్చేసరికి డోర్‌లాక్‌చేసి ఉంది. ఎంతపిలిచినాతీయకపోవడంతో ఆమెస్నేహితురాలు ఉర్విపంచల్‌ను సంప్రదించి కీమేకర్‌సాయంతో తలుపులు తెరిచారు. అప్పటికే కేబుల్‌వైర్‌తో ఉరివేసుకుందని, అంధేరి ఈస్ట్‌లోని సెవెన్‌హిల్స్ ఆసుపత్రికి తరలించగా ఆమె చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారని ఆమె బంధువులు తెలిపారు. పండిట్‌ను సృష్టి గాఢంగా ప్రేమించిందని, ఆతడు ఆమెను వేధించాడని, బహిరంగంగానే దుర్భాషలాడేవాడని, మాంసాహారం తినడం మానేయాలనికూడా ఒత్తిడిచేసాడని, ఆమెపట్ల పండిట్ అసభ్యంగా ప్రవర్థించడం ఇతర బంధువులుకూడాచూసారని, ఒకపార్టీలోమాంసాహారం తిన్నందుకు అందరి ముందూ అరిచాడని ఆమె కారును పాడుచేసిరోడ్డుపై వంటరిగా వదిలేసి వెళ్లిపోయాడని ఆరోపించారు. పండిట్ సోదరి నిశ్చితార్థం ఫంక్షన్‌కు సృష్టివెళ్లలేకపోవడంతో పదిరోజులపాటు మాట్లాడలేదని, దీనితో సృష్టిమానసికంగా కుంగిపోయిందని సృష్టిమామ ఆరోపించారు.

### దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమలో

# పనులు నిలిపివేయండి

>> స్థానికంగా ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అవసరమైతే పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. తాజాగా ప్రభుత్వ సూచనల మేరకు ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజులుగా ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనలో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఆందోళనకారులు పోలీసులపై దాడి చేయగా వారు పరుగులు తీశారు. ఈ ఆందోళనలో మహిళలు సైతం పురుగుల మందు డబ్బాలు పట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలంటూ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 26న కూడా జాతీయ రహదారిపై రాస్తారోకో చేయగా అక్కడికి వచ్చిన ఆర్డీవోను అడ్డుకుని కారు దహనానికి యత్నించారు. దీంతో కొద్దిసేపటి వరకు అక్కడ ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం సాయంత్రం వరకు గ్రామస్థులు రహదారిపైనే వంటావార్పు నిర్వహించి అక్కడే భోజనం చేశారు. రాత్రి కూడా సెల్ ఫోన్ల వెలుతురులో సైతం నిరసన కొనసా గించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల ఆందోళనలపై స్పందించిన కలెక్టర్ రంగంలోకి దిగి నిరసనకారులతో చర్చించారు. నిరసన నేపథ్యంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తం పరిస్థితులపై సీఎం కార్యాలయం (సీఎంవో) కు నివేదిక పంపినట్లు ఇవాళ ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఆందోళనకా రులు సైతం నిరసన విరమించి ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని గత కొన్ని నెలలుగా స్థానిక ప్రజలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే తమ పంట పొలాలతోపాటు పాటు అక్కడి పర్యావరణం సైతం దెబ్బతింటుందని గ్రామస్థులు వాపోయారు. ఈ నిరసనలో చిన్నారులు, వృద్ధులు మహిళలు సైతం పాల్గొన్నారు. ప్రస్తుతానికి ఆందోళన విరమించిన గ్రామస్థులు, ప్రభుత్వం నిర్ణయంపై తదుపరి కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు.

# దివ్యాంగులు వైకల్యాన్ని జయించాలి: మంత్రి సీతక్క

### గచ్చిబౌలిలో ప్రారంభమైన దివ్యాంగుల క్రీడోత్సవాలు



బుధవారం జెండా ఊపి దివ్యాంగ క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 27 ప్రభాతవార్త:** వికలాంగులు తమ వైకల్యాన్ని జయించి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ధనసరి సీతక్క అన్నారు. తమకు ఉన్న వైకల్యాన్ని లెక్కచేయకుండా క్రీడల్లో రాణించి ప్రపంచస్థాయి పథకాలు సాధించడం అభినందనీయమన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్న వికలాంగుల క్రీడోత్సవాలను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిలతో కలిసి మంత్రి సీతక్క ముఖ్య అతిధిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వికాలంగులు క్రీడల్లో రాణించి ప్రపంచ స్థాయి పథకాలు సాధిస్తున్నారని, క్రీడల్లో వారిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్‌కు చెందిన జీవన్ జి.దీప్తి ప్రపంచ పారా ఒలంపిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి దేశం గర్వించేలా చేసిందని అన్నారు. దీప్తి సాదించిన మెడల్‌కు గుర్తింపుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం తరపున 1కోటి రూపాయల నగదు బహుమతి, 500 గజాల స్థలం అందజేశామని అన్నారు. దీప్తికి త్వరలోనే గ్రూప్ 2 ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వికలాంగులకు 6వేల పెన్షన్ పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని, వికలాంగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దంగా ఉన్నారన్నారు. త్వరలోనే బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను సైతం నింపుతామని అన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో క ృషి చేస్తుందని తెలిపారు. శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్పోర్ట్ స పాలసీలో వికలాంగులకు ఎక్కువ ప్రాధాన్యం కల్పిస్తామని, శాట్స్ ఎల్లవేళలా వికలాంగ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. వికలాంగుల కో ఆపరేటీవ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధునాతన క్రీడా పరికరాల కోసం 3లక్షల రూపాయల కేటాయింపు, అన్ని రకాల సహాయ ఉపకరణాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మేనేజ్‌మెంట్ కమిటీలో తీర్మానం చేసినట్లు తెలిపారు. దీప్తికి నగదు బహుమతి, ఇంటి స్థలం కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క ృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజా తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణాలలో బ్యాంకులు మొండి చేయి

### వానాకాలంలో 56 శాతమే

### లక్ష్యం రూ.49 వేల కోట్లు

### ఇచ్చింది రూ.27 వేల కోట్లు

### రబీలోనూ ఇదే పరిస్థితి

### రైతులకు అందని పంట రుణాలు

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** వ్యవసాయ రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకులు రైతులకు మొండిచెయ్యి చూపుతున్నాయి. ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు వానాకాలం, యాసంగి సీజన్లలో పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుత యాసంగి సీజనులో వ్యవసాయానికి అవసరమైన పంట రుణాలను మంజూరు చేయడంలో వాణిజ్య, సహకార, ప్రైవేటు బ్యాంకులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సాగు కష్టాలు తప్పడం లేదు. రుణాలు మంజూరు చేయకపోవడంతో సాగు డోలాయమానంలో పడిదని పలువురు రైతులు వాపోతున్నారు. రుణాలు మాఫీ కాకపోవడంతో బకాయిలు ఉన్నాయనే పేరుతో బ్యాంకులు రైతులకు కొత్తగా పంట రుణాలను మంజూరు చేయడం లేదు. దీంతో రైతులకు సాగుకు అవసరమైన పెట్టు బడులు లభించక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ప్రస్తుత సంవత్సరంలో రైతులకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 70 లక్షల మంది పట్టాదారులు ఉండగా, ఇందులో 21.66 లక్షల మంది రైతులకు మాత్రమే అప్పులు మంజూరయ్యాయి. దీంతో రైతులు అధిక వడ్డీకి ప్రైవేటు అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ 2024-25 వానాకాలం సీజనులో కేవలం 55 శాతమే బ్యాంకులు రుణ లక్ష్యం సాధించాయి. ఈ సీజనుకు పంట రుణాల కింద రాష్ట్ర వ్యాప్తంగా 48,888 కోట్ల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ లక్ష్యాన్ని నిర్ధారించింది. అయితే ఇందులో 27,485 కోట్ల రూపాయలను మాత్రమే రైతులకు మంజూరు చేశాయి. రునాలు మాఫీ కాలేదనే సాకు చూపి బ్యాంకులు మిగిలిన రైతులకు మొండి చెయ్యి చూపించాయి. గత ఖరీఫ్ సీజనులోనూ తెలంగాణలో రైతులకు పూర్తి స్థాయిలో రుణాలు అందని పరిస్ ్థతి నెలకొంది. దీనికితగినట్లుగా ప్రస్తుత రబీ సీజనులోనూ రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోపక్క రుణ మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీల నిమిత్తం ఇటీవల నిధులను విడుదల చేసి వాటిని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసినా యాసంగి పెట్టుబడులకు అవి అందనీయకుండా బ్యాంకులు అడ్డుపడుతున్నాయి. బకాయిలకు సంబంధించిన వడ్డీలకు వాటిని జమ చేసుకుంటున్నారు. అప్పోసప్పో చేసి యాసంగి పైర్లు సాగు చేద్దామన్నా ఎవరి దగ్గరా డబ్బులు లేకుండా పోయాయయని అంటున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో కీలకమైన యాసంగి సీజనులో విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా వ్యవసాయానికి అవసరైన వాటిని కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపధ్యంలో ప్రస్తుత రబీ సీజనులో వ్యవసాయ పెట్టుబడులకు కావాల్సిన రుణాలు అందక రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.

# డిజిటల్ అరెస్టును నివారించిన ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్

### సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా వృద్ధ వైద్య దంపతులకు ఊరట

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టు ఆగడాల నుంచి ఓ వృద్ధ వైద్య దంపతులు తృటిలో తప్పించుకున్నారు. వీరిని నేరగాళ్ల బారి నుంచి ఎస్‌బిఐ అధికారులు కాపాడడం విశేషం. వివరాలు ఇలావున్నాయి. శివార్లలోని లోతుకుంటలో 78 ఏళ్ల ఓ వైద్యుడు, ఆయన సతీమణి 75 ఏళ్ల వైద్యురాలు అ దే ప్రాంతంలో నర్సి ంగ్ హోంను నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు వైద్యుడికి ముంబాయి నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి తన పేరు రంజిత్ అని కస్టం విభాగం నుంచి మాట్లాడుతున్నానని, మీకు మలేషియా నుంచి పార్శిల్ వచ్చిందని, అందులో 16 పాస్ పోర్టులతోపాటు ఒక ఎటిఎం వుందని, చె ప్పాడు. దీనికి బదులిచ్చిన వైద్యుడు ఇది తనది కాదని సమాధానం ఇచ్చారు. అయితే ఫోన్ చేసిన రంజిత్ అనే వ్యక్తి తాను ఫోన్ కాల్‌ను ఢిల్లీ క్రైం విభాగం ఎసిపి సునీల్ కుమార్‌కు బదిలీ చేస్తున్నానని, ఆయనతో మాట్లాడాలని బెదిరించాడు. దీంతో ఆ వైద్యుడు ఫోన్ అందుకోగా సునీల్ కుమార్‌గా చెప్పుకున్న వ్యక్తి వైద్యుడిని బెదర గొట్టి వెంటనే 30 బ్యాంకు ఖాతాలు తెరవాలని, మీ బ్యాంకు ఖాతాలో ఎంత నగదు వుందని కోరాడు. తన ఖాతాలో 30లక్షల రూపాయలు వుందని వైద్యుడు చెప్పడంతో పాటు ఇది సీనియర్ సిటిజన్స్ విభాగం ఎఫ్‌డి రూపంలో వుందని తెలిపారు. అయితే ఫోన్ చేసిన వ్యక్తి ఈ నగుదును ఎస్‌బి అకౌంట్‌లోకి మార్చి తాను చె ప్పిన ఖాతాలకు వెంటనే బదిలీ చేయాలని కోరాడు. దీంతో భయపడ్డ వైద్యుడు వెంటనే లోతుకుంట ఎస్‌బిఐకి వచ్చి బ్యాంకు మేనేజర్‌ను కలిసి తన ఖాతాలో ఎఫ్‌డి రూపంలో వున్న 30 లక్షల రూపాయలను వెంటనే ఎస్‌బి ఖాతాలకు బదిలీ చేయాలని కోరాడు. అయితే వైద్యుడు ఆందోళనగా వున్న విషయాన్ని గమనించిన ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్ ఉన్న పళంగా 30 లక్షల రూపాయలు ఎందుకు బదిలీ చేస్తున్నారని కోరగా తన భార్యకు అపోలో ఆసుపత్రిలో బ్రెయిన్ ఆపరేషన్‌కో సమని వైద్యుడు తెలిపారు. అయితే దీనిపై అనుమానం చెందిన బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్ దీనిపై వెంటనే అపోలో ఆసుపత్రికి ఫోన్‌చేసి వాకబు చేయగా తమ ఆసుపత్రిలో వైద్యుడి భార్యకు ఎలాంటి బ్రెయిన్ సర్జరీ జరగడంలేదని అక్కడి అధికారులు తెలిపారు. ఇదే సమయంలో పోలీసు అధికారిగా చెప్పుకున్న సునీల్ కుమార్ వైద్యుడికి మూడుసార్లు ఫోన్‌చేసి 30లక్షల రూపాయలను వెంటనే ఎస్‌బి ఖాతాలకు మార్చాలని వైద్యుడిని బెదరగొట్టగా ఈ విషయాన్ని గమనించిన బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై రంగంలో దిగిన పోలీసులు వైద్యుడికి కౌన్సిలింగ్ ఇచ్చి అసలు విషయాన్ని తెలుసుకుని ఇదంతా సైబర్ నేరగాళ్లు ఆడిన నాటకమని వైద్యుడికి వివరించారు. డిజిటల్ అరెస్టు పేరిట మిమ్మల్ని బెదిరించి 30 లక్షల రూపాయలు కాజేయాలని చూశారని చెప్పడంతో పా టు దీనిపై వైద్యుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. పోలీసులు, బ్యాంకు అధికారులు ఇచ్చిన భరోసాతో వైద్యుడు సేదతీరడంతో పాటు ధైర్యం పొందారు.

మొత్తం మీద ఎస్‌బిఐ బ్యాంకు అధికారుల కృషితో వృద్ధ దంపతులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా నివారించబడ్డారు. వారి డబ్బులు 30 లక్షల రూపాయలు కూడా భద్రంగా వున్నాయి.

# పార్లమెంటును కుదిపేసిన అదానీ వ్యవహారం

### జెపిసి ఏర్పాటుచేసి అవినీతిపై చర్చకు డిమాండ్

### పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ, నవంబరు 27:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభంనుంచి కూడా ఆదాని వ్యవహారంపై ఉభయసభలో గందరగోళం నెలకొంది. అమెరికా కోర్టులో అభియోగాలునమోదయిన క్రమంలో ఈ వ్యవహారంపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. విపక్షాలుఈ అంశాన్ని లేవనెత్తడంతో ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం కలిగింద.ఇ దాంతో లోక్‌సభ అలా ప్రారంభం అయి ఇలా మధ్యాహ్నం 12 గంటలవరకూ వాయిదాపడింద.ఇ రాజ్యసభను కూడా ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్ 11.30 గంటలవరకూ వాయిదావేసారు. తర్వాత ఉభయసభలు ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పురాకపోవడంతోరేపటికి వాయిదా పడ్డాయి. సోషల్‌మీడియాలో అసభ్యకర సందేశాల కట్టడికోసం ఉన్న చట్టాలనుద్దేశించి కేంద్ర సమాచారశాఖమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడారు. మనదేశ సంస్కృతికి ఈసామాజిక మాధ్యమ సంస్థలు చెందిన దేశాల సంస్కృతికి తేడా ఉంది. అందుకే ఈ సందేశాలకు సంబంధించిన అంశాన్ని స్టాండింగ్‌కమిటీ పరిశీలించి కఠిన చట్టాలు ఏర్పాటుకు సహకరించాలనికోరుతున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈపార్లమెంటు సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత ఎంపి రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడారు. ఆదానిని అరెస్టుచేయాలని డిమాండ్‌చేసారు. చిన్నచిన్న ఆరోపణలపై ఎంతోమందిని అరెస్టుచేస్తున్నారని వేలకోట్ల రూపాయల కుంభకోణం అని ఈ వ్యవహారంలో ఆదానిని జైలులో పెట్టాలన్నారు. మోడీప్రభుత్వం ఆయన్ను రక్షిస్తోందని విమర్శలతో ధ్వజమెత్తారు. దీనిపై బిజెపి కూడా తీవ్రస్థాయిలోనే కౌంటర్ ఇచ్చింది. జార్జిసోరోస్ స్క్రిప్ట్ ఇక్కడ అమలుచేస్తున్నారని విమర్శించింది. ప్రముఖ బిలియనీర్ జార్జ్ సోరోస్, రాక్‌ఫెల్లర్స్ బ్రదర్స్ వంటి దిగ్గజాలతో నడుస్తున్నఆర్గనైజ్డ్‌క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు పరిశోధనాత్మక కథనాలు వెలువరిస్తుంది. గతంలో ఆదానిగ్రూప్‌పై ఒక సంచలన కథనం కూడా ప్రచురించిన సంగతి తెలిసిందే. అలాగేయుపిలోని సంభాల్ మసీదు సర్వేపరంగా వెల్లువెత్తిన ఉద్రిక్తతలును కూడా చర్చించాలంటూ సమాజ్‌వాదిపార్టీ పార్లమెంటులో ప్రస్తావించింది. స్పీకర్ ఓంబిర్లా ప్రతిపక్ష సభ్యులనుప్రశ్నోత్తరాలయ సమయం కొనసాగనీయాలని వారులేవనెత్తిన సమస్యలను తర్వాతప్రస్తావిస్తామంటూ పదేపదే చెప్పినా విపక్ష సభ్యులు వినలేదు. నిరసనల నినాదాలతో హోరెత్తించారు. రాజ్యసభ కార్యకలాపాలు కూడా అలాగేకొనసాగాయి. వివిద అంశాలపై చర్చలుచేపట్టాలని, ఆదానిగ్రూప్‌నుప్రత్యేకించి ప్రస్తావించారు. ప్రతిపక్ష సభ్యులుప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని ధన్‌కర్ తిరస్కరించడంతో విపక్ష సభ్యులు నిరసనలు ప్రకటించారు. ఆదాని వ్యవహారంపై జెపిసి ఏర్పాటుచేయాలని, సంభాల్ హింసపై చర్చ పెట్టాలని విపక్ష సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసారు. అలాగే దేశరాజధానిలో నేరప్రవృత్తి పెరిగిపోయిందని, శాంతిభద్రతలపైనా చర్చలు జరగాలంటూ విపక్షాలు ఆందోళన చేయడంతో ధనకడ్ సభను గురువారానికి వాయిదా వేసారు.

# ఎన్‌డిపిఎస్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నా ఆగని డ్రగ్స్ దందాలు

### ధూల్‌పేట్, నానక్‌రాంగూడ సహా నిన్నటి గుడుంబా అడ్డాలు గంజాయి డెన్‌లుగా మారిన వైనం

### ఉత్తర, పశ్చిమాది రాష్ట్రాలకు గంజాయి కారిడార్‌గా మారిన తెలంగాణ

**హైదరాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల కేసులకు సంబంధించి పోలీసు శాఖ తొలిసారిగా శిక్షల శాతం 17కు పెరిగేలా చేయడం సంతోషించదగ్గ విషయమే అయినా పట్టుబడుతున్న డ్రగ్స్, దొరికిపోతున్న స్మగ్లర్లతో పోలిస్తే ఇది తక్కువేనని చెప్పాలి. రాష్ట్రంలో ఇతర డ్రగ్స్ విషయం ఎలావున్నా గంజాయి అంశం మాత్రం తీవ్రంగా ఆందోళన కలిగించేదిగా వుందనడంలో ఎలాంటి సందేహం లేదు. నిన్నటి గుడుంబా డెన్‌లు ధూల్‌పేట్, నానక్‌రాంగూడ తదితర బస్తీలు ఇప్పుడు గంజాయి అడ్డాలుగా మారాయి. ఇదే సమయంలో ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాలకు ఒడిషా, ఎపి నుంచి గంజాయి తరలివెళ్లేందుకు తెలంగాణ రహదారులు ఒక కారిడార్‌గా మారిన విషయం మరింత ఆందోళన కలిగించేదిగా వుంది. రాష్ట్రంలో గంజాయి పట్టుబడని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో గం జాయిని సమూలంగా నిర్మూలించేందుకు అబ్కారీ విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్‌గా అనుభవం కలిగిన ఐజి ర్యాంక్ అధికారి కమలాసన్ రెడ్డిని సర్కారు ప్రత్యేకం గా నియమించింది. ఆయన బాధ్యతలు చేబట్టిన తరువాత గంజాయిపై అబ్కారీ శాఖ ముప్పేట దాడులు చేబట్టి కొంతమేర ఫలితాలు సాధించినా పూర్తిస్థాయిలో నిర్మూలన అనుకునంత సులభంకాదని పోలీసులతో పాటు అబ్కారీ శాఖ అధికారులే అంగీకరిస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు కేవలం 59 మాత్రమే నమోదయినట్లు పోలీసు శాఖ చెబుతోంది. ఇందులో గంజాయి కేసులు కేవలం 30 మాత్రమే నమోదయ్యాయనిచెబుతోంది. ఇక ఈ ఏడాది 226 కేసుల్లో 39 కేసుల నిందితులకు శిక్షలు పడేలా చేసిన పోలీసు శాఖ ఇందులో. నాలుగు కేసుల్లో 17 మంది నిందితులకు 20 ఏళ్ల శిక్ష పడేలా చేసింది. మొత్తం మీద ఈ ఏడాదిలో పది నెలల వ్యవధిలో 39 కేసుల్లో నిందితులుగా వున్న 52 మంది డ్రగ్స్ స్మగ్లర్లకు శిక్షలు పడేలా చేసిన పోలీసు శాఖ శిక్షల శాతాన్ని 17కు పెంచింది. గత ఏడాది డ్రగ్స్ కేసుల్లో నిందితులకు శిక్షల శాతం 11గా వుందని పోలీసు శాఖ వెల్లడించింది.

# 2022 నాటి తిరుగుబాటు కుట్రలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బొల్సోనారో



**బ్రసేలియా, నవంబరు 27:** బ్రెజిల్ 2022లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధ్యక్షుడు జైర్ బొల్సోనారో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో దేశంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో మాజీ అధ్యక్షుడి పాత్ర సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫెడరల్ పోలీసులు 884 పేజీల నివేదికను అక్కడి న్యాయస్థానికి సమర్పించారు. మాజీ అధ్యక్షుడితో పాటు మరో 36 మంది పేర్లను అందులో జోడించారు. 2022 నాటి ఎన్నికల్లో ఓటమి తర్వాత అప్పటి అధ్యక్షుడు బొల్సోనారో పదవిలోనే కొనసాగడానికి తిరుగుబాటు కుట్రకు ప్రణాళికలు రచించినట్లు పోలీసులు ఆరోపించారు. అప్పుడు జరిగిన అల్లర్లలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. అంతేకాకుండా డిసెంబర్‌లో ఆయన ఓ సమావేశాన్ని ఏర్పాటుచేసి, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఓ ముసాయిదాను విడుదల చేశారు. అందులో నలుగురు దర్యాప్తు అధికారులు సంతకం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకుండా త్రివిధ దళాలు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దీనికి ఆర్మీ, ఎయిర్‌పోర్స్ అధికారులు తిరస్కరిం చడంతో విచారణ ముందుకు సాగలేదు. మరోవైపు ఈ ఆరోపణలను బోల్సోనారో ఖండించారు. రిజర్వ్ జనరల్, మరో అరడజను మంది అధికారులతో ఎవరూ తిరుగుబాటు చేయలేరు. ఆ నివేదికల్లో నిజం లేదు. తిరుగుబాటు గురించి నేను ఎప్పుడూ చర్చలు జరపలేదు అని ఆయన విలేకరులతో అన్నారు. బ్రెజిల్ ఎన్నికల్లో లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వాకు 50.9 శాతం ఓట్లు లభించగా బోల్సోనారోకు 49.1 శాతం వచ్చాయి. ఎన్నికల ఫలితాలను అంగీకరించేందుకు బోల్సోనారో నిరాకరించారు. ఈ క్రమంలోనే జనవరి 8న వేల సంఖ్యలో ఆయన మద్దతు దారులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. దేశ అధికార కేంద్రాలైన నేషనల్ కాంగ్రెస్, సుప్రీంకోర్టు, అధ్యక్ష భవనాలను ముట్టడించారు. భద్రతా వలయాలను చేదించుకుని కీలక భవనాల్లోకి చొరబడి అక్కడ సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ క్రమంలోనే భద్రతా బలగాలు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టాయి.

# ఐపిఎల్‌లో తెలుగు క్రికెటర్లు

## స్టార్ ప్లేయర్లపై యూత్ ఆధిక్యం
## వీరిపైనే ఫ్రాంఛైజీల భారీ అంచనాలు



**ఢిల్లీ:** ఐపిఎల్ 2025 హంగామా మొదలైంది. ఐపిఎల్ ఉన్న 182 మంది ఆటగాళ్లలో 10వ వంతు ఆటగాళ్లు తెలుగు క్రికెటర్లే ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి ఐపిఎల్ వేలంలో పాల్గొన్న క్రికెటర్లకు కళ్లు చెదిరే డిమాండ్ కనిపించింది. కొంతమంది సీనియర్స్, స్టార్ ఇమేజ్ ఉన్న క్రికెటర్స్ కంటే ఈ యువ తెలుగు క్రికెటర్లే ఎక్కువ ధర పలికారు. హైదరాబాద్లోనే పుట్టి, పెరిగిన ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్‌కు ఐపిఎల్లో భారీ డిమాండ్ ఉంది. గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహించిన సిరాజును దక్కించుకునేందుకు గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపించడంతో రూ.2 కోట్ల బేస్ ప్రైస్ ఉన్న సిరాజ్ ధర ఏకంగా రూ.12.25 కోట్లకు పెరిగింది. తొలుత గుజరాత్, చెన్నై పోటాపోటీగా సిరాజ్ ధరను రూ. 8 కోట్ల ధర వరకు పెంచాయి. ఆ తరువాత గుజరాత్, బెంగళూరు జట్ల మధ్య పోటీ ఏర్పడింది. అంతిమంగా గుజరాత్ రూ.12.25 కోట్లు పెట్టి సిరాజును సొంతం చేసుకుంది.

ఐపిఎల్లో క్రేజ్ ఉన్న మరో హైదరాబాద్ బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ. తిలక్‌ను వేలానికి ముందుగా ముంబై జట్టు రూ.8 కోట్లకు రీటెయిన్ చేసుకుంది. గత ఐపిఎల్ సీజన్లో అతను తన సత్తా చాటుకుని డిమాండ్ ఉన్న ప్లేయర్ అనిపించుకున్నాడు. మ్యాచ్ ఎలాంటి పరిస్థితిలో ఉన్నా సరే ఒత్తిడికి గురికాకుండా అగ్రెసివ్ స్టైల్లో బ్యాటింగ్ చేయడం అతడి ప్రత్యేకత. టీ20 ఫార్మాట్ వరుసగా మూడు సెంచరీలు చేసిన మొదటి బ్యాట్స్‌మన్ కూడా కావడం విశేషం. టీ20 ఇన్నింగ్స్‌లో 150 ప్లస్ రన్స్ చేసిన ఫస్ట్ ఇండియన్ బ్యాట్స్‌మెన్ కూడా తిలకే. ఇక ఆల్ రౌండర్ విశాఖపట్నం నితీష్ కుమార్‌రెడ్డి పర్ ఫార్మెన్స్ చూస్తే చేతికి బాల్ ఇచ్చినా, బ్యాట్ ఇచ్చినా రెచ్చిపోవడమే పనిగా పెట్టుకున్నాడు. నితీష్‌ని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.6 కోట్లు పెట్టి రీటెయిన్ చేసుకుంది. గత ఐపిఎల్లో నితీష్ పర్ఫార్మెన్స్ ఆ తరువాత టీమిండియాలోనూ ఛాన్స్ దక్కేలా చేసింది. ఈ వేలంలో సీనియర్స్ సిరాజ్, తిలక్, నితీష్ కుమార్‌రెడ్డికి పలికిన ధరలు కంటే ఎక్కువ. ఐపిఎల్లోకి వీళ్లకంటే ముందే ఎంట్రీ ఇచ్చి సీనియర్స్ అజింక్య రహానే, వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్య లాంటి ఆటగాళ్లు కూడా అంత ధర పలకలేదు. కాగా ఐపిఎల్ ఫాలో అయ్యే వారికి గుర్తుకొచ్చే గుంటూరు షేక్ రషీద్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.30 లక్షలు పెట్టి కొనుగోలు చేసింది.

గతేడాది కూడా ఆయన చెన్నై సూపర్ కింగ్స్‌లోనే ఉన్నాడు. ఈ ఏడాది కూడా ఆ జట్టు మరోసారి అతడిని సెలెక్ట్ చేసుకుందంటే అది అతడిపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తోంది. అలాగే కాకినాడకు చెందిన పెనుమత్స సత్యనారాయణరాజును ముంబై ఇండియన్స్ రూ.30 లక్షలు పెట్టి సొంతం చేసుకుంది. డొమెస్టిక్ క్రికెట్‌లో రాణిస్తున్న అతనికి ఇదే తొలి ఐపిఎల్ సీజన్. పేస్ బౌలింగ్‌లో రాజు దిట్ట. అందుకే ముంబై అతన్ని సెలెక్ట్ చేసుకుంది. డొమెస్టిక్ క్రికెట్లో రాణిస్తున్న మరో క్రికెటర్ శ్రీకాకుళానికి చెందిన త్రిపురపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆశలు పెట్టుకుంది. రూ.30 లక్షలు పెట్టి వేలంలో అతన్ని సొంతం చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్ బౌలింగ్‌కు అతడు ఒక అసెట్ అవుతాడని ఢిల్లీ ప్లాన్ చేసుకుంటోంది. ఏపి డొమెస్టిక్ క్రికెట్లో రాణిస్తున్న మరో యువ కెరటం పైలా అవినాష్. విశాఖపట్నానికి చెందిన ఈ యువ క్రికెటర్ ను పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది. ఈ ఆల్ రౌండర్ కోసం పంజాబ్ రూ.30 లక్షలు వెచ్చించింది.

# గ్లోబల్ సూపర్ లీగ్‌లో.. 'అమెజాన్' గెలుపు

### 6 వికెట్ల తేడాతో ఓడిన లాహోర్ ఖలందర్స్

**ఢిల్లీ:** గ్లోబల్ సూపర్ లీగ్-2024లో భాగంగా లాహోర్ ఖలందర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అమెజాన్ వారియర్స్ విజయం సాధించింది. గయానా వేదికగా గ్లోబల్ సూపర్ లీగ్ భారత కాలమానం ప్రకారం బుధవారం నుండి ప్రారంభమైంది. ఈ లీగ్‌లో భాగంగా లాహోర్ ఖలందర్స్,గయానాఅమెజాన్ వారియర్స్ జట్లు తలపడ్డాయిది.



ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో అమెజాన్ వారియర్స్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఖలందర్స్ 19.2 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. టామ్ ఏబెల్ 48 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, వికెట్ కీపర్ రొసింగ్టన్ 25 పరుగులు, లూక్ వెల్స్ 11 పరుగులతో రెండంకెల స్కోర్లు చేయగలిగారు. అమెజాన్ వారియర్స్ బౌలర్లలో ప్రిటోరియస్ 4 వికెట్లు, తంజిమ్ మసన్ సకీబ్ 2 వికెట్లు, హసన్ ఖాన్ 2 వికెట్లు, ఇమ్రాన్ తాహిర్ ఒక వికెట్‌ను దక్కించుకున్నారు. 126 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన అమెజాన్ వారియర్స్ బ్యాటర్ షాయ్ హోప్ 45 పరుగులతో నాటౌట్‌గాను, కీమో పాల్ 27 పరుగులు చేసి నాటౌట్‌గా రాణించడంతో 17.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయ తీరాలకు చేరింది. వారియర్స్ ఇన్నింగ్స్‌లో మొయిన్ లీ 17 పరుగులు, మార్క్ దయాల్ 1 పరుగు, షిమ్రాన్ హెట్‌మైర్ 14 పరుగులు, రోస్టన్ ఛేస్ 15 పరుగులు చేశారు. ఖలందర్స్ బౌలర్లలో సలనఖమన్ మిర్జా 2 వికెట్లు, ఆసిఫ్ అఫ్రిది 2 వికెట్లు పడగొట్టారు.



## డోపింగ్ టెస్ట్ నిరాకరణతో
# బజరంగ్ 4 యేళ్లు బ్యాన్

**ఢిల్లీ:** భారత్ స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా తాజాగా నిషేధానికి గురయ్యాడు. యాంటీ డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు నాడా అతడిపై నాలుగేళ్ల నిషేధం విధించింది. మార్చి 10న జాతీయ జట్టుకు ఎంపిక ట్రయల్స్ సందర్భంగా డోప్ టెస్ట్ కోసం నమూనా ఇవ్వడానికి అతడు నిరాకరించడం వల్ల ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ శుభారంభం



**ఢిల్లీ:** సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్, మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో భారత్ ఆటగాళ్లు శుభారంభం చేశారు. తెలంగాణకు చెందిన సిక్కిరెడ్డి-సుమిత్‌రెడ్డి ద్వయం గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ జోడీ, కె మనీషా-షేక్ గౌస్ జంట తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. తొల రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సిక్కి-సుమిత్ 21-10, 21-18తో సంజిత్ సుబ్రమణియన్-గౌరీ కృష్ణలపైన, శివాని-రోహన్ జోడీ 21-14, 21-12తో నితిన్-అనఘా ద్వయంపై విజయం సాధించారు. హైదరాబాద్‌కు చెందిన కె మనీషా-షేక్ గౌస్ జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో మనీషా-గౌస్ ద్వయం 21-16, 12-21, 21-19తో నితిన్ కుమార్-రిధి కౌర్ తూర్‌లను ఓడించింది. ఇక మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ ప్లేయర్లు నవ్య కందేరి, తన్వీ శర్మ, మాన్విసింగ్ మెయిన్ డ్రాకు అర్హత పొందారు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో నవ్య 21-8, 21-8తో సాక్షి గహ్లావత్‌పై, తన్వీ శర్మ 21-12, 21-10తో అశి రావత్‌పైన, మాన్సి సింగ్ 21-11, 14-21, 21-12తో బోనం ప్రశంసపై గెలిచారు. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ క్రీడాకారులు రిత్విక్, సిద్ధార్థ ప్రతాప్ సింగ్, సనీత్ దయానంద్ మెయిన్ డ్రాకు చేరుకున్నారు.. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగం నుండి టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ చివరి నిముషంలో వైదొలగింది.

# బిడబ్ల్యూఎఫ్ ఫైనల్స్‌కు గాయత్రి, ట్రెసా



**ఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బిడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు భారత్ జంట పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రెసా జాలీ జోడీ అర్హత సాధించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రెసా వరల్డ్ ర్యాంకింగ్‌నప్రకారం అర్హత సాధించారు. బిడబ్ల్యూఎఫ్ ప్రకటించిన ఈ ర్యాంకింగ్స్‌లో టాప్ 8 జోడీలు ప్రతిష్టాత్మక టోర్నీ ఆడతాయి.

భారత్ నుండి ఈ టోర్నీలో వీరిద్దరు మాత్రమే బరిలోకి దిగుతున్నారు. ఈ సీజన్‌లో గాయత్రి-ట్రెసా నిలకడగా రాణించారు. చైనా మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్స్‌లోనే ఓడినా, ఇతర టోర్నీల ప్రదర్శన వారికి ఈ అవకాశం కల్పించేసింది. సింగపూర్ ఓపెన్, మకావు ఓపెన్‌లలో గాయత్రి, ట్రెసా సెమీఫైనకు చేరారు. ఇప్పటి వరకూ బిడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు మాత్రమే 2018లో విజేతగా నిలిచింది. చైనాలోని హాంగ్జూలో డిసెంబరు 11-15 తేదీల మధ్య బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్ జరుగుతాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.